

తర్లుపాడు సమీపంలో ఎండు తెగులు సోకిన మిర్చి తోట (ఫైల్)

కదలని సాగు

సంక్రాంతి ముగిసినా పంటలు వేసింది 62.36శాతమే

రబీని వెంటాడిన ప్రతికూల వాతావరణం

- నవంబరులో తీవ్ర వర్షాభావం
- డిసెంబరులో అంతటా జోరువాన
- పొగాకు మినహా అన్ని పంటలు తక్కువగానే సాగు
- శనగ 42శాతం విస్తీర్ణానికే పరిమితం
- వానలతో మినుము, అలసందలకు తీవ్ర నష్టం
- శనగ, మొక్కజొన్నలపైనా అధిక ప్రభావం

జిల్లాలో ఈ ఏడాది రబీ సాగును కీలక సమయంలో వాతావరణం దెబ్బతీసింది. ముమ్మరంగా పంటలు సాగయ్యే నవంబరులో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నామమాత్రంగా వర్షం ఉండే డిసెంబరులో విస్తారంగా పడ్డాయి. ప్రత్యేకించి రబీ పంటలు ఆలస్యంగా సాగయ్యే జిల్లాలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇలా విరుద్ధమైన వాతావరణ పరిస్థితితో రబీ పంటల సాగు ముందుకు సాగలేదు. సంక్రాంతి పర్వదినం ముగిసినప్పటికీ సాగు విస్తీర్ణం 62.36శాతం మించకపోవడం ప్రతికూల పరిస్థితికి అద్దం పడుతోంది. వేసిన పంటల్లోనూ కొన్ని భారీ వర్షాలతో దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఒంగోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటల సాగు రెండు భాగాలుగా ఉంటుంది. జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు రబీ సీజన్‌గా పరిగణిస్తారు. అయితే రబీ ప్రారంభమయ్యే అక్టోబరుతోపాటు నవంబరులో మంచి వర్షాలు కురుస్తాయి. జిల్లాలో వార్షిక వర్షపాతం 762.90 మి.మీ కాగా రబీ మూడు నెలల్లో సుమారు 470.0 మి.మీ కురుస్తుంది. అలా జరిగితే ఖరీఫ్ పంటలు బాగా ఎదిగి మంచి దిగుబడులు ఇవ్వడంతోపాటు రబీ పంటలు విస్తారంగా సాగ వుతాయి. అలాంటిది ఈ ఏడాది రబీలో తీవ్ర ప్రతికూల పరిస్థితి నెలకొంది. సీజన్ ఆరంభమయ్యే అక్టోబరులో మంచి వర్షాలు కురిసినా విస్తారంగా రబీ పంటల సాగు చేసే నవంబరులో వర్షాభావం నెలకొంది. ఆనెలలో 136.2 మి.మీ సాధారణ వర్షపాతం కాగా కేవలం 49.90 మి.మీ మాత్రమే కురిసింది. అలా ఆ నెలలో దాదాపు 63.70శాతం లోటు నమోదు కావడంతో పంటల సాగు ముందుకు సాగలేదు.

డిసెంబరులో అతివృష్టి

మరోవైపు స్వల్ప వర్షాలు కురవాల్సిన డిసెంబరులో విస్తారంగా పడ్డాయి. డిసెంబరులో 43.50 మి.మీ సాధారణ వర్షపాతం కాగా ఏకంగా 105.90 మి.మీ నమోదైంది. అలా 143.40శాతం అధిక వర్షపాతంతోపాటు నెల తొలివారంలోనూ, తిరిగి చివరి వారంలోనూ రోజుల తరబడి వర్షాలు కురిశాయి. ఫలితంగా తగిన సమయంలో పంటలు సాగు చేసే

మిగతా 6వ పేజీలో

పొగాకు మాత్రమే.. మిగతా ఉసూరే

రబీలో శనగ, వరి, పొగాకు, మొక్కజొన్న, మినుము, అలసంద, మిర్చి వంటివి ప్రధాన పంటలు కాగా పొగాకు మినహా ఏ ఒక్క పంటా సక్రమంగా సాగు కాలేదు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఒక్క పొగాకు మాత్రమే కొద్దిమేర ఇంకా వేసే అవకాశం ఉంది. ఇతర పంటలకు సాగు సమయం మించిపోయింది. అత్యధికంగా 49,177 హెక్టార్లలో సాగయ్యే శనగ ఈ ఏడాది కేవలం 20,381 హెక్టార్ల (42.36శాతం)లో మాత్రమే సాగైంది. సాధారణంగా ఈ పంట నవంబరు, డిసెంబరు నెలల్లో అధికంగా సాగు చేస్తారు. అయితే ఆ రెండు నెలల్లోనూ వాతావరణ పరిస్థితి ఈ ఏడాది అంత అనుకూలంగా లేక శనగ సాగు కాలేదు. దీని వల్ల దాదాపు 60శాతం విస్తీర్ణంలో శనగను రైతులు సాగు చేయలేకపోయారు. ప్రస్తుతం విత్తనం వేయాలన్నా సాగు సమయం మించిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎందుర్కొంటున్నారు.



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పామూరు మండలం కంభాలదిన్నె వద్ద దెబ్బతిన్న మినుము పైరు (ఫైల్)

గీత కార్మికులకు పండుగ

సగం ధరకే మద్యం దుకాణాలు

- జిల్లాకు 18 షాపులు మంజూరు
- ఇప్పటికే సీఎం హామీ మేరకు ఒకటి కేటాయింపు



ఒంగోలు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలలో గీత కార్మికులకు పది శాతం కేటాయిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు 17 షాపులు కేటాయించారు. అదేక్రమంలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గీత కార్మికుడికి ఒక దుకాణాన్ని కేటాయిస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో మొత్తం 18 దుకాణాలు వారికి కేటాయించినట్లైంది. అందులో 17 షాపులకు దరఖాస్తులను ఆహ్వానించేందుకు కసరత్తు మొదలైంది. అందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించారు. ఈ దుకాణాలకు లైసెన్స్ ఫీజును మాత్రం ఇప్పుడు ఉన్న దానిలో సగానికి తగ్గించారు. దరఖాస్తు ఫీజు పాత పద్ధతిలోనే రూ2లక్షలుగా నిర్ణయించారు. ఒకరు ఒక మద్యం దుకాణానికి మాత్రమే దరఖాస్తు చేయాలన్న నిబంధన విధించారు. 2018లో చేపట్టిన స్మార్టు సర్వేలో కులాల వారీగా గీత కార్మికుల జనాభా లెక్కలు తీశారు. ఈ ప్రకారం మన జిల్లాలో గౌడ్‌కు 7, ఈడిగకు 1, గౌడకు 7, గమళ్లకు 1, గౌండ్లకు 1 లెక్కన మద్యం దుకాణాలను అధికారులు కేటాయించారు. మండలాల వారీ కేటాయింపులు చేసిన తర్వాత దరఖాస్తులను ఆహ్వానించి లాటరీ పద్ధతిలో ప్రక్రియను పూర్తి చేస్తారు. గీత కార్మికులకు లైసెన్స్ ఫీజులో రాయితీ ఇవ్వడంపై ప్రస్తుతం మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు గుర్రుగా ఉన్నారు. సగం ధరకు దుకాణం తీసుకున్న వారితో పోటీపడి మద్యం విక్రయాలు చేయడం కష్టంగా ఉంటుందని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలపై ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మాత్రం గీత కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం మద్యం దుకాణాలు కేటాయించడంతోపాటు లైసెన్స్ ఫీజులో రాయితీ ఇస్తూ విధివిధానాలను తయారు చేసింది.



దర్శిలోని ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన మినీ స్విమ్మింగ్‌పూల్

ఉచితం పేరుతో మాయ

- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- దర్శిలో మినీ స్విమ్మింగ్‌పూల్, చిన్నపిల్లల ఆట స్థలం ఏర్పాటు
- అక్కడే ఐస్‌క్రీమ్ స్టాల్ పెట్టి జోరుగా వ్యాపారం
- చోద్యంచూస్తున్న అధికారులు

6లో

ఎదురొచ్చిన మృత్యువు!

- కట్టెల ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఇద్దరు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- అందరూ ముండ్లమూరు మండలం శంకరాపురం వాసులు
- కామేపల్లి పోలేరమ్మ ఆలయానికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం
- కొండపిలోని మద్దులూరు రోడ్డులో ఘటన

కొండపి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కట్టెల ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కొండపి-మద్దులూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కోల్డ్‌స్టోరేజీ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వీరంతా ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. శంకరాపురం గ్రామానికి చెందిన చిరంజీవి, అవీన్, దుర్గారావుతోపాటు వారి బంధువైన గుంటూరు జిల్లా నూజెండ్లకు చెందిన నిమ్మళ్ల వెంకటరావు హైదరాబాద్‌లో వివిధ పనులు చేస్తుంటారు. సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వచ్చారు. జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ గుడికి వెళ్లి మద్యం తాగకుండా ఉండేందుకు అక్కడ అంత్రం కట్టించుకున్నారు. రాత్రికి తిరిగి రెండు మోటార్ సైకిళ్లపై స్వగ్రామానికి బయల్దేరారు. బైక్‌ను అవీన్ నడుపుతున్నాడు. వెనుక చిరంజీవి, దుర్గారావు కూర్చున్నారు. కాగా మూగచింతల గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్ కొండపి వైపు ఎదురు వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలవడంతో చిరంజీవి (44) అక్కడికక్కడే మరణించాడు. బండి నడుపుతున్న అవీన్, వెనుక కూర్చున్న దుర్గారావుకు బలమైన గాయాలయ్యాయి. అటుగా వస్తున్నవారు 108 వాహనానికి సమాచారం అందించడంతో ఇద్దరినీ కొండపిలోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ దుర్గారావు (33) మరణించారు. మెరుగైన వైద్యం కోసం అవీన్‌ను

మిగతా 6వ పేజీలో




ఘటనా స్థలంలోనే మరణించిన చిరంజీవి



చికిత్స పొందుతూ మృతిచెందిన దుర్గారావు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న అవీన్



హైడ్రోఫోనిక్స్ విధానంలో పెంచుతున్న మొక్కలను చూపుతున్న విద్యార్థులు

'మొక్క'వోని దీక్షతో..

- పచ్చదనానికి బాటలు వేస్తున్న విద్యార్థులు
- 'ఫ్రీడం బర్డ్స్' ఆధ్వర్యంలో అవగాహన
- 5వేల మొక్కల పంపిణీకి శ్రీకారం
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు
- ఆసక్తి కనబరుస్తున్న మహిళలు

7లో

సిలిండర్లకు అదనంగా వసూలు చేస్తే చర్యలు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరిక



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నదన్నారు. సిలిండర్లకు వినియోగదారుడు చెల్లించిన నగదును మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నదన్నారు. అయితే లబ్ధిదారులు దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జేసీ తెలిపారు. అటువంటివి నిజమని రుజువైతే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామన్నారు. బ్లాక్‌లిస్టులో పెట్టి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఉచిత గ్యాస్ పొందే ఏ వినియోగదారుడూ అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తుంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్లు 0891-2590100, 0891-2590102కు ఫిర్యాదు చేయాలని జేసీ కోరారు.



శెగ్గం శ్రీనివాసరావుకు బొకే ఇచ్చి అభినందిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'శెగ్గం'

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఒంగోలు నగర వాసి, బీసీ సామాజికవర్గానికి చెందిన శెగ్గం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఓ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. పార్టీ జిల్లా ఎన్నికల అధికారిగా మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ, సహాయ ఎన్నికల అధికారులుగా కందుకూరి సత్యనారాయణ, డాక్టర్ నర్సింగరావు వ్యవహరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచనలకు అనుగుణంగా శెగ్గం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకు ముందు పూర్వ అధ్యక్షుడు పి.వి.శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో బాజీ మాట్లాడుతూ బీజేపీ పేదల పార్టీ అని, నిరంతరం వారి సంక్షేమం కోసం పనిచేస్తున్నదన్నారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా నూతన అధ్యక్షుడికి సహకరించాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన శ్రీనివాసరావును ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ కృష్ణారెడ్డి, వైసీ యోగయ్యయాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, శివాజీ, టి.శ్రీనివాస్‌చౌదరి, రాము తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీనివాసులు అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

విజేతలు.. ఈ చిత్ర యోధులు!

- 35వ అంతర్జాతీయ చిత్రకళ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురికి అవార్డులు
- వీరంతా కంభంకు చెందినవారే

వివరాలు 7వ పేజీలో..

ముఖ్యమంత్రితో ముత్తుముల జగన్నాథ్‌రెడ్డి



సీఎం చంద్రబాబుతో జగన్నాథ్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి) : దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు జగన్నాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ అభివృద్ధికి ప్రవాసులుగా తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆయన ఐర్లాడ్ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. గత ఎన్నికల సమయంలో తన అన్న అశోక్‌రెడ్డి గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. సీఎంను కలిసిన అనంతరం మంత్రి లోకేష్, బ్రహ్మిణి దంపతులను సన్మానించారు.

ఎదురొచ్చిన మృత్యువు

(5వ పేజీ తరువాయి)

ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ఒకరైన చిరంజీవి బంధువు నిమ్మళ్ల వెంకటరావు ఘటన వివరాలను వివరిస్తూ.. అవీన్, చిరంజీవి, దుర్గారావు ముగ్గురు ఒకే వాహనంపై వస్తున్నారని, తాను ముందుగా వెళ్తున్నానని తెలిపాడు. కొండపిలో బయల్దేరేటప్పుడు తాను జాగ్రత్తగా రండి అన్నానని, అయితే బండి నడుపుతున్న అవీన్ తాను కొమరం పులిని.. ఏమీ కాదన్నాడని విలపిస్తూ వివరించాడు. తాను ముందు వెళుతూ ఎంతకూ రాకపోవడంతో అనకర్లపూడి వద్ద నుంచి వారికి ఫోన్ చేయగా, ఎవరో లిఫ్ట్ చేసి ప్రమాదం జరిగిందని వివరించారని వెంకటరావు తెలిపాడు. తాను ఘటనా స్థలికి వెళ్లేసరికి తనకు బాబాయి వరసయ్యే చిరంజీవి విగతజీవిగా పడి ఉన్నాడని విలపించాడు. తాను శంకరాపురంలో వివాహం చేసుకున్నానని తన భార్య మేనమామ చిరంజీవని వివరించారు. ఆయనకు ఇటీవలే భార్య కూడా చనిపోయిందన్నాడు. అందరం సంక్రాంతి పండుగకు వచ్చామని, బుధవారం హైదరాబాద్ వెళ్లాల్సి ఉందని ఆయన వివరించారు. కాగా ఘటనాస్థలానికి కొండపి సీఐ జిసోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకుని ఉంటే వారి ప్రాణాలు దక్కేవన్నారు.

పీఎం అవార్డ్స్‌కు ప్రతిపాదనలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం అవార్డ్స్ కోసం తగిన ప్రతిపాదనలతో వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబరు ఆఖరు వరకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలన్నారు. పీఎం అవార్డుల కోసం మొత్తం మూడు కేటగిరీలలో 14 అంశాలకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం విశ్వకర్మ, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, పీఎం స్వానిధి, అంగన్‌వాడీ, పోషన్ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పీఎం సూర్య ఘర్ ముఫ్త్‌బిజిలి యోజన, మిషన్ ఇంద్రధనస్సు, రైతులు, మత్స్యకారులు, పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం అమలు చేస్తున్న వివరాలను నమోదు చేయాలని చెప్పారు. యాస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి కింద వైపాలెం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను, వినూత్న కార్యక్రమాల కింద జిల్లాలో అమలు చేస్తున్న బంగారుబాల్యం, మార్గదర్శిని కార్యక్రమాలను కూడా సమగ్రంగా నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ రెడ్డి, బేబి రాణి, కిరణ్‌కుమార్, హేనాసుజన్, కట్టా వెంకటేశ్వర్లు, డీపీఎం మాధూరి, సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ సూరిబాబు పాల్గొన్నారు.

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెకర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న రీ సర్వేతో పాటు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం డివిజనల్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. మ్యూటేషన్ల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం రీ సర్వే ప్రక్రియ కూడా మండలంలోని ఒక గ్రామంలోనే చేస్తున్నందున పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే అంశాలపై రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన అవగాహన కోసమే జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని గుర్తు చేశారు. మీ కోసం అర్జీల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ అన్సారియా స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకపత్రం అందజేత

కారుణ్య నియామకం కింద కోఆపరేటివ్‌శాఖలో ఉద్యోగం కల్పిస్తూ కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఉద్యోగ నియామకపత్రం అందజేశారు. కోఆపరేటివ్ శాఖలో పని చేస్తూ నావూరి రామకృష్ణ మృతి చెందడంతో ఆయన సోదరుడు ఏడుకొండలుకు ఈ ఉద్యోగం కల్పించారు. 12ఏళ్ల అనంతరం కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడం పట్ల దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, పక్కన జమున

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ముక్కు సంబంధమైన అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. మంగళవారం స్థానిక జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాకినాడకు చెందిన ఓ యువతి గత కొన్నేళ్ళుగా ముక్కులో కండ పెరిగి తీవ్ర ఇబ్బందులు గురైందన్నారు. అయితే అందుకు సంబంధించి పలు వైద్యశాలలో రెండుసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం లేదని, తిరిగి ముక్కులో కండ పెరగడం ద్వారా మరింత అవస్థలు పడాల్సి వచ్చిందని చెప్పారు. వైద్య భాషలో దీనిని రినోస్పోరిడియోసిస్‌గా పిలుస్తారని తెలిపారు. కాగా జీజీహెచ్‌లో అందుతున్న వైద్యసేవల పట్ల నమ్మకంతో ఆ యువతి ఆసుపత్రిలో చేరగా ఈఎన్‌టీ విభాగం వైద్యులు ప్రభాకర్, సహ వైద్యబృందంతో శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని, అలాగే తిరిగి ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలు సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు. సమావేశంలో సీఎస్‌ఆర్‌ఎం డాక్టర్ మాధవీలత, డిప్యూటీ డైరెక్టర్ మంజుల, అడిషనల్ డైరెక్టర్ కుమారి, ఏవో రమణమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఏవోగా అద్దయ్య బాధ్యతల స్వీకరణ

ఒంగోలులోని జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా కె.అద్దయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన అద్దయ్య ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన ఆసుపత్రి అధికారులు, వైద్యులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు.

అవీఇవీ

నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెక్కును అందిస్తున్న నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ

ఒంగోలు కల్చరల్, జనవరి21(ఆంధ్రజ్యోతి): చీమకుర్తికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దివంగత చీమకుర్తి నాగేశ్వరరావు కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మంగళవారం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల చీమకుర్తి నాగేశ్వరరావు కుటుంబం, ఆయన భార్య ఆర్థికంగా పడుతున్న ఇబ్బందుల గురించి ఆంధ్రజ్యోతిలో ప్రత్యేకంగా వార్త వచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన గోపాలకృష్ణ తన ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ అడ్వయిజర్ డాక్టర్ కృష్ణయ్య సహకారంతో నగదును నాగేశ్వరరావు భార్య వెంకాయమ్మకు ఒంగోలులో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాల వేదికపై చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు పాల్గొన్నారు.

క్రీడాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యం

అభివృద్ధిలో ఏలూరి కృషి అభినందనీయం

శాప్ చైర్మన్ రవినాయుడు



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ చైర్మన్ రవినాయుడు చెప్పారు. మంగళవారం మార్టూరు మండలం ఇసుక దర్శిలో ఉన్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఏలూరి ఫిట్‌నెస్ సెంటర్‌ను, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఏలూరి సాంబశివరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దీంతోపాటు క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఆయన చూపుతున్న చొరవ మరువలేనిదన్నారు.

ఏలూరి యూత్ ఫిట్‌నెస్ పోస్టర్ ఆవిష్కరణ

ఎమ్మెల్యే ఏలూరి పుట్టినరోజు సందర్భంగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, రవికుమార్‌తో ప్రారంభించనున్న ఏలూరి యూత్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను రవినాయుడు ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే సిఫార్సు లేఖలకు స్పందన

పర్చూరులో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి, కారంచేడు రామానాయుడు స్టేడియం కాంపౌండ్‌వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు క్యాంప్ కార్యాలయ సిబ్బంది వినతిపత్రాన్ని చైర్మన్‌కు అందజేశారు. తక్షణమే స్పందించిన రవినాయుడు నిధులు మంజూరు చేసి క్రీడాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు.

కదలని సాగు

(5వ పేజీ తరువాయి)

అవకాశం లేకుండా పోయింది. ముందుగా వేసిన కొన్ని పైర్లు ఆ వర్షాలకు దెబ్బతిన్నాయి. జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 61వేల హెక్టార్లు కాగా సంక్రాంతి పండుగ దాటినా లక్ష హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. అంటే సాధారణ విస్తీర్ణంలో కేవలం 62.36శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగయ్యాయి. కనీసం మూడింత రెండోంతుల విస్తీర్ణంలో కూడా పంటలు సాగుకు నోచుకోలేదు.

వరి సగమే సాగు

వరి పంట సాధారణ విస్తీర్ణం 21,669 హెక్టార్లు కాగా 11,317.07 (52.23శాతం) సాగైంది. పంట సాగు అంత లాభసాటిగా లేకపోవడం, నీటి లభ్యతపై నమ్మకం కలగక రైతులు సాగు తగ్గించారు. పొగాకు సాధారణ సాగు విస్తీర్ణం 27,298 హెక్టార్లు కాగా దాదాపు 32,745 హెక్టార్లకు(120శాతం) పైగా నాట్లు వేశారు. మినుము 25,607 హెక్టార్లకు 11,547(45.10శాతం) సాగు కాగా డిసెంబరులో కురిసిన భారీ వర్షాలతో అంతా దెబ్బతినిపోయింది. సాగైన విస్తీర్ణంలో అధిక భాగం అక్టోబరులో విత్తనం వేసింది కావడంతో డిసెంబరులో వర్షాలు కురిసే సమయానికి కాయదశకు చేరింది. విస్తారంగా కురిసిన వర్షాలకు పంట అంతా దెబ్బతింది. తెగుళ్లతో ఆకులు, వర్షాలతో కాయలు కుళ్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఈ సీజన్ రబీ ప్రధాన పంటల సాగు వివరాలు

పంట	సాధారణ సాగువిస్తీర్ణం (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం హెక్టార్లలో (హెక్టార్లలో)
వరి	21,669.00	11,317.07
శనగ	49,177.00	20,381.00
పొగాకు	27,298.00	32,745.00
మినుము	25,607.00	11,547.51
మిర్చి	6787.00	3969.24
మొక్కజొన్న	4960.00	5050.00

దెబ్బతిన్న అలసంద, మిర్చి

అలసంద 7,565 హెక్టార్లకు దాదాపు 6,819 హెక్టార్లు (90.14శాతం)లో సాగైంది. ఈ పంట కూడా మినుము తరహాలో వర్షాలతో దెబ్బతిని చేతికి రాకుండా పోయింది. మిర్చి 6,787 హెక్టార్లకు 3,969 (58.48శాతం) హెక్టార్లలో సాగు కాగా తెగుళ్లు బారిన పడి అత్యధికం దెబ్బతింది. మొక్కజొన్న పంట 4,960 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి 5,050 (102శాతం) హెక్టార్లలో సాగైనప్పటికీ వర్షాలకు దెబ్బతింది. ఇలా రబీ సీజన్‌లో ఆశించిన స్థాయిలో పంటలు పడకపోగా సాగైన విస్తీర్ణంలో కూడా డిసెంబరు వర్షాలు దెబ్బతీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఏబీసీలో పడిపోయిన నీటి మట్టం

» ఎగువ భాగంలో తగ్గించారంటున్న అధికారులు

» ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలంటున్నరైతులు



ఏబీసీ కాలువకు తక్కువగా వస్తున్న నీరు

బల్లికురవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువలో నీటి మట్టం పడి పోయింది. ఎగువ భాగంలో నీటిని అధికారులు నిలుపుదల చేయించడంతో మంగళవారం ఏబీసీలో నీరు అడుగుకు చేరింది. ఇప్పుడు వచ్చే నీరు మేజర్‌లకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి నీరు రావడం తగ్గిందని అధికారులు మాత్రం పై భాగంలో నీటిని నిలిపి వేశారని, రెండు రోజుల్లో మరలా నీరు వస్తుందని చెప్తున్నారని, ఇప్పుడు నీటి విడుదల నిలిపివేస్తే పంటలు బెట్టకు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 33వ మైలు వల్లాపల్లి లాకుల వద్దకు రెండు అడుగుల మేర కూడా నీరు రావడం లేదని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే సాగర్ నీటిని ఏబీసీకి విడుదల చేయాలని లేకుంటే పంటలు దెబ్బ తింటాయని రైతులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయని రైతులు తెలిపారు.

అలరించిన కనక పుష్యరాగం

● ఉత్సాహంగా కోలాట ప్రదర్శన

● వీనులవిందుగా నాదస్వరం



కనక పుష్యరాగం నాటికలో ఓ దృశ్యం

ఒంగోలు కల్చరల్ , జనవరి21(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజు విభిన్న కార్యక్రమంతో ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఇందులో భాగంగా వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి కోలాట బృందాలు, నాటక పరిషత్‌లు, నాదస్వర బృందాలు, నృత్య బృందాలు ప్రేక్షకుల హృదయాలను మెప్పించే విధంగా ప్రదర్శనలు ఇస్తూ శహభాష్ అనిపించుకుంటున్నారు. కళాపరిషత్ ఉత్సవాలను తిలకించేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

ఇక మంగళవారం సాయంత్రం కలికివాయికి చెందిన సాయినాథ నాదస్వర బృందం నాదస్వర కచ్చేరి శ్రవణానందకరంగా కొనసాగింది. అనంతరం పుల్లలచెరువు మండలం నరజాతుల తండాకు చెందిన శ్రీరామభక్త కోలాట బృందానికి చెందిన 42 మంది కళాకారులు వివిధ జానపద, భక్తిగీతాలకు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ప్రేక్షకులను మైమరపించింది. ఇక ప్రముఖ సినీ నటులు ఎస్.కె.మిశ్రో దర్శకత్వంలో దృశ్య వేదిక, విజయవాడ వారిచే ప్రదర్శితమైన కనక పుష్యరాగం సాంఘిక నాటకం ఇటు హాస్యం, అటు సందేశాల సమ్మిళితంగా కొనసాగింది. దివంగత రాఘవ రచించిన ఈ నాటకం హెచ్‌వీఆర్.ప్రసాద్ నిర్వహణలో ప్రదర్శితం కాగా దొంతాల ప్రకాష్, ఈమని భాగ్యరాజ్, కత్తి శ్యాంప్రసాద్, జి.రమేష్, నరేన్ చాగ్ర, బి.రూపా, జి.సత్యనందిని తదితరులు చక్కటి హావభావాలు పలికిస్తూ నటించారు.

31న అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

» రూ.4కోట్ల దాతల సహకారంతో నిర్మాణం

» హాజరుకానున్న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి



పర్చూరులో రూపుదిద్దుకుంటున్న శ్రీ అష్టలక్ష్మి ఆలయం

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారం రూ.4కోట్ల వ్యయంతో పర్చూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈనెల 31న ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి పా బోలు వెంకట సత్యనారాయణ తెలిపారు. కారర్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీతోపాటు, శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామి హాజరు కానున్నారు. పలు అభిషేకాలతోపాటు మహా కుంభాభిషేకం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఉచితం పేరుతో మాయ

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

మినీ స్విమ్మింగ్‌పూల్, చిన్నపిల్లల ఆటస్థలం ఏర్పాటు

అక్కడే ఐస్‌క్రీం స్టాల్ పెట్టి జోరుగా వ్యాపారం

చోద్యంచూస్తున్న అధికారులు



ఎన్ఎస్‌పీ స్థలంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్

దర్శి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేసి ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దర్శి-కురిచేడు రోడ్డులో ఒక డెయిరీ యజమాని ప్రభుత్వ స్థలంలో మినీ స్విమ్మింగ్ పూల్, పిల్లల పార్క్‌తోపాటు ఐస్‌క్రీమ్ స్టాల్ ఏర్పాటు చేసి జోరుగా వ్యాపారం చేయిస్తూ లబ్ధిపొందుతున్నాడు. పిల్లలకు ఉచితంగా స్విమ్మింగ్ పూల్‌లో ఎంజాయ్ చేసే అవకాశం ఇస్తున్నామని, ఆడుకునేందుకు వస్తువులు ఏర్పాటు చేశారు. అక్కడకు వచ్చిన చిన్నారులతో తెలివిగా తినుబండారాలు విక్రయించి ముమ్మరంగా వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే అమాయకులు ఉచిత సేవ చేస్తున్నాడని భ్రమపడుతున్నారు. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవైపు ఆర్‌అండ్‌బీ స్థలం, మరోవైపు ఎన్నెస్పీ స్థలంలో ఈ నిర్మాణాలు చేపట్టారు. ఏళ్ల తరబడి మినీ స్విమ్మింగ్ పూల్ నడుపుతున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

దర్శిలో అనేకచోట్ల ఆక్రమణలు

దర్శి పట్టణంలో అనేకచోట్ల ఇదే తంతు జరుగుతోంది. ఎంతో విలువైన రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి సొంత స్థలంలో కలుపుకుంటున్నారు. ఆతర్వాత బిల్డింగ్ కట్టుకొని ప్రభుత్వ స్థలంతో కలిపి ప్రహరీగోడలు నిర్మించుకుంటున్నారు. మరికొంతకాలానికి అక్కడ కూడా నిర్మాణాలు చేపట్టి స్వాహా చేస్తున్నారు. దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-పొదిలి రోడ్డులో కూడా పలుచోట్ల రోడ్డు మార్జిన్ స్థలాలను ఆక్రమించారు. సంబంధిత అధికారులు మాత్రం ఆక్రమణల గురించి పట్టించుకోవడం లేదు. ఆయా శాఖలకు చెందిన కోట్లాది రూపాయల విలువచేసే స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమేరకు చలనం వచ్చింది. అక్కడక్కడా ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం ఆరంభించారు. అన్నిశాఖల అధికారులు పూర్తిస్థాయిలో స్పందించి విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల చెర నుంచి తొలగించి రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్రీడం బర్డ్స్ సంస్థ ఏం చేస్తోందంటే..



- ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరం వెనుక ఉన్న ఫ్రీడం బర్డ్స్ స్కూల్ నిర్వాహకులు మాల్యాద్రి తమ స్కూలులో విద్యార్థులకు చదువు, ఆటలతో పాటు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు.
- నగరంలోని ఇతర ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం మొక్కలలోని రకాలు, వాటిని పెంచే విధానం, ఏయే మొక్కలకు ఏ రకమైన సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి? వాటి ఎదుగుదల సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? లాంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- దీన్ని మరింతమందికి చేరువచేసేందుకు రోటరీ క్లబ్ సహకారంతో ఆయన ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



నాటు పుదీనా మొక్కను చూపుతున్న సాయి శాస్త్రిత

చెట్లు మానవ మనుగడకు ఎంతో ముఖ్యం. పర్యావరణ హితానికీ, మనుషుల జీవనానికీ ఇవే ఆధారం. పూర్వకాలంలో ఇంటి చుట్టూ విశాలమైన ఖాళీస్థలంలో అనేక రకాల కూరగాయల, పూల మొక్కలను పెంచేవారు. దీనివల్ల అటు పచ్చదనం పెరగటమే కాకుండా ఇంటికి కావలసిన కూరగాయల అవసరాలు సైతం నెరవేరేవి. అయితే ప్రస్తుతం పట్టణాలు, నగరాలలో ఇంటి చుట్టూ మొక్కలు పెంచేంత ఖాళీస్థలం కానీ, వాటి పెంపకం పట్ల అనేకమందికి అవగాహన కానీ ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఒంగోలు లాయర్‌పేటలోని ఫ్రీడం బర్డ్స్ సంస్థ భావితరాలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించే దిశగా కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా శిక్షణ పొందుతూ అనేకమంది విద్యార్థులు వారి నివాసాల్లోని కుండీలలో, ఇళ్లపైన రూఫ్ గార్డెనింగ్ ద్వారా మొక్కలు పెంచుతున్నారు.

\- ఒంగోలు కల్చరల్, ఆంధ్రజ్యోతి

మొక్కవోని దీక్షతో..

- పచ్చదనానికి బాటలు వేస్తున్న విద్యార్థులు
- 'ఫ్రీడం బర్డ్స్' ఆధ్వర్యంలో అవగాహన
- 5వేల మొక్కల పంపిణీకి శ్రీకారం
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు
- ఆసక్తి కనబరుస్తున్న మహిళలు



మొక్కలను ఎలా పెంచాలో వివరిస్తున్న చిన్నారులు



మైక్రోగ్రీన్స్ విధానంలో మొక్కలివి

అవగాహన కల్పించేందుకు ఏం చేస్తున్నారంటే..

- ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలకు అనేకమంది ప్రేక్షకులు వస్తున్నారు. వారందరికీ వివిధ రకాల కూరగాయల మొక్కలు, ఆరోగ్యానికి దోహదం చేసే మెడిసినల్ ప్లాంట్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు.
- సుమారు 5 వేల మందికి ఉచితంగా ఆయా మొక్కల విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు.
- ఇందులో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ తాము ఎలా మొక్కలను పెంచుతున్నదీ వివరిస్తూ సందర్శకులకు మొక్కల పెంపకంపై వివరిస్తున్నారు.
- దాదాపు 10 రకాల ఆకుకూరలతో పాటు రణపాల, తిప్పతీగ, వాము, పుదీన, ఉత్తరేణి వంటి 10 రకాల మెడిసినల్ ప్లాంట్లు, 5 రకాల కూరగాయల, మెంతులు వంటి మైక్రోగ్రీన్స్ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.
- అటు సందర్శకులు, ముఖ్యంగా మహిళలు ఈ కార్యక్రమం పట్ల ఎంతో ఆసక్తిని కనబరుస్తూ విత్తనాలు, దానికి తగిన ఎరువులను సైతం తీసుకెళ్తున్నారు.
- ఇక ఏ మొక్కకు ఏ ఎరువు అవసరమో నిర్వాహకులు అక్కడికక్కడే కలిపి ఇస్తున్నారు.



మెంతుకూర..

నేనే మొక్కలు పెంచుతున్నాను



నేను ఒంగోలు అపెక్స్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాను. అయితే ఫ్రీడం బర్డ్స్‌లో మొక్కల పెంపకంపై శిక్షణ తీసుకుని నేనే స్వయంగా మా ఇంటిపై వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచుతున్నాను. ఇందుకు మా తల్లిదండ్రులు సైతం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి కూడా ఇదేవిధంగా మొక్కల పెంపకంపై తెలుసుకుని వారి ఇళ్లలో వీటని పెంచితే ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మంచిదని నా అభిప్రాయం.

\- బి.సాయి శాస్త్రిత, 5వ తరగతి విద్యార్థిని

ప్రతి ఇల్లూ పచ్చదనంతో నిండాలన్నదే లక్ష్యం



ప్రస్తుతం ప్రకృతిలో తగినంతగా వృక్ష సంపద లేదు. రసాయన ఎరువులు వేసి పెంచే ఆకుకూరలు, కూరగాయల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యానికి హానికరం కాని మొక్కలు పెంచేవిధంగా ప్రజల్లో అవగాహన పెరగాలి. అయితే చిన్నతనం నుంచే దీనిపైన అవగాహన, ఆసక్తి పెంచాలి. భావితరాల వారు ప్రతి ఇంటినీ పచ్చదనంతో నింపటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదనే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. వారి ఇళ్లలో పెంచటానికి విత్తనాలు, ఎరువు ఉచితంగా ఇస్తున్నాం.

\- మాల్యాద్రి, ఫ్రీడం బర్డ్స్ నిర్వాహకుడు

కార్పొరేషన్‌లో మరోసారి ప్రక్షాళన

బాధ్యతల నుంచి పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తొలగింపు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస పారిశుధ్య విభాగంలో మరోసారి ప్రక్షాళన చేస్తూ కమిషనరు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'వార్డుకోవారం' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, మరోవైపు డ్రైనేజీలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించి, కాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఇప్పటి వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ విధుల్లో అలసత్వం వహిస్తూ, కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండటంతోపాటు, పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌స్పెక్టర్‌ను ఆ బాధ్యతలను నుంచి తొలగించారు. ఇన్‌స్పెక్టర్ కంకణాల ఆంజనేయులు పనితీరుపై అనేకసార్లు ఆరోపణలు ఉన్నాయి. నాలుగు సార్లు మెమో అందుకున్న ఆంజనేయులును ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తొలగించారు. గుత్తి కొండవారిపాలెంలోని కంపోస్ట్ యార్డ్ వద్దకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన అక్కడ జరుగుతున్న పనులు పరిశీలన, ప్రతిరోజూ నగరంలోని చెత్త సేకరణ వాహనాలను నమోదు చేసుకునే బాధ్యతలు అప్పగించారు. ఇతర డివిజన్‌లకు చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.జయరావు, డి.వెంకటేశ్వర్లు, యు.శ్రీరామ్‌లను ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తొలగించి మేస్త్రీలుగా నియమించారు. వారి స్థానంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌లుగా శానిటరీ సెక్రటరీలు సిహెచ్.కృష్ణ కుమార్, జి.వెంకట సుబ్బయ్య, డి.శ్రీనివాసరావులకు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనరు ఆదేశాలు జారీ చేశారు.

నేడు కీలక శాఖలపై మంత్రి స్వామి సమీక్ష

ఒంగోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పలు కీలక ప్రభుత్వ శాఖలపై మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి బుధవారం సమీక్ష నిర్వహించనున్నారు. అందులో మంత్రి ప్రాతినిథ్యం వహించే నాలుగు సంక్షేమశాఖలతో పాటు మరో ఏడు కీలకశాఖలు ఉన్నాయి. స్థానిక ప్రకాశం భవన్ రెండో అంతస్తులోని కలెక్టర్ సమావేశపు హాలులో ఉదయం పది గంటలకు ఈ సమావేశం జరగనుంది. మంత్రి స్వామి ప్రాతినిథ్యం వహించే సాంఘిక సంక్షేమం, దివ్యాంగుల, ఎస్సీ కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్‌లపై తొలుత సమీక్ష చేస్తారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో తాగునీటి సమస్యపై యంత్రాంగాన్ని అప్రమత్తంచేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఇరిగేషన్‌శాఖలపై సమీక్ష చేయనున్నారు.

వాతావరణ పరిస్థితులలో జిల్లాలో వివిధ రకాల సీజనల్ వ్యాధుల ఉధృతితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై అనేక విమర్శలు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష చేయనున్నారు. ఆ శాఖ పరిధిలోని హెల్త్, వైద్య విధాన పరిషత్, ఒంగోలులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మెడికల్ కాలేజీతో పాటు మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అందుబాటులో ఉండే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉండగా సంబంధిత అధికారులు శాఖల వారి నివేదికలు రూపొందిస్తున్నారు.



పఠాన్ ఖాశింకు అవార్డు తెచ్చిన చిత్రం

- 35వ అంతర్జాతీయ చిత్రకళల పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురికి అవార్డులు
- వీరంతా కంభంకు చెందినవారే



బ్రహ్మోత్సవ చిత్రనిధి అవార్డు సాధించిన లేడీ ఇన్ ద మిర్రర్ చిత్రం

విజేతలు.. ఈ చిత్ర యోధులు!

తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో కోనసీమ చిత్రకళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కంభంకు చెందిన ముగ్గురు చిత్రకారులు ప్రథమ స్థానంలో నిలిచి అవార్డులు సాధించారు. ఈనెల 19వ తేదీ అమలాపురంలో జరిగిన చిత్రకళ బ్రహ్మోత్సవాల్లో కంభం చిత్రకారుడు పఠాన్ ఖాశిం వేసిన 'స్టిల్ లైఫ్' పెయింటింగ్‌కు ఇంటర్నేషనల్ మెగా బ్రహ్మోత్సవ అవార్డు దక్కింది. కంభంకు చెందిన ఎం.రాజశేఖర్‌రాజు వేసిన 'లేడీ ఇన్ ద మిర్రర్' పెయింటింగ్‌కు బ్రహ్మోత్సవ చిత్ర నిధి అవార్డు వచ్చింది. కందులాపురంలో నివసిస్తున్న ఉన్నం విజయ్‌కుమార్ వేసిన 'ది లయన్' చిత్రానికి ఇంటర్నేషనల్ చిత్రకళ గోల్డెన్ పద్మ అవార్డు దక్కింది. కోనసీమ చిత్రకళాపరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామస్వామి అధ్యక్షతన ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

\- కంభం, ఆంధ్రజ్యోతి



ఇంటర్నేషనల్ చిత్రకళా గోల్డెన్ పద్మ అవార్డు సాధించిన లయన్ చిత్రం



ఇంటర్నేషనల్ మెగా బ్రహ్మోత్సవ అవార్డులు సాధించిన పఠాన్ ఖాశిం, రాజశేఖర్‌రాజులను సన్మానిస్తున్న కంభంవాసులు

ప్రఖ్యాతిగాంచిన చిత్రకారుల్లో స్థానం



అమలాపురంలో 35 ఏళ్లుగా చిత్రకళా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈనెల 19వ తేదీ ఆదివారం జరిగిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో 1500 మందికిపైగా చిత్రకారులు పాల్గొన్నారు. ఎక్కువసార్లు ఈ పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించిన వారిలో కమిటీ సభ్యులు 215 మంది చిత్రకారులను ఎంపిక చేశారు. వారు 'ప్రఖ్యాతిగాంచిన చిత్రకారులు' అనే బుక్కును తయారు చేసి అందులో వారి ఫొటోలను, విజయాలను, అవార్డులను ప్రచురిస్తున్నారు. అందులో కంభంకు చెందిన పఠాన్ ఖాశింకు, నాకు చోటు దక్కడం మా అదృష్టం.

\- రాజశేఖర్‌రాజు, అవార్డు గ్రహీత



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అమలాపురం ఎమ్మెల్యే మాధవి



వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

దేవదాయ స్థలంపై రగడ

- కొనుగోలు చేశానని నిర్మాణాలను ప్రారంభించిన ఓ మహిళ
- రోడ్డు స్థలం ఆక్రమించారని అడ్డుకుంటున్న స్థానికులు
- తాజాగా ఇరువర్గాల మధ్య వాగ్వివాదం
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

సింగరాయకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ స్థలంపై రగడ చోటుచేసుకుంది. దాన్ని తాము కొనుగోలు చేశామని, అందుకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఓ మహిళ నిర్మాణాలు చేపట్టగా కొంత మంది స్థానికులు అడ్డుకున్నారు. ఆమె రోడ్డు స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. వివరాలోకి వెళ్తే.. సింగరాయకొండ ప్రధాన రహదారి పక్కన 605/ఎ సర్వే నంబర్‌లో పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 4 సెంట్ల స్థలం ఉంది. దాన్ని సింగరాయకొండకు చెందిన ఓ మహిళ ఒక వ్యక్తి వద్ద కొనుగోలు చేశానని మంగళవారం అందులో రేకులతో షెడ్డు నిర్మాణానికి ఉపక్రమించారు. స్థానికులు కొంత మంది వచ్చి రోడ్డు స్థలంలో నిర్మాణం చేపట్టడానికి వీల్లేదని ఆమెతో వాగ్వాదానికి దిగారు. రేకులను ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంది. వెంటనే కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బి.మహేంద్ర తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. దేవదాయ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు తహసీల్దార్ రవికి, దేవదాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ స్థలం వివాదంలో ఉన్నందున ఎవ్వరూ అందులోకి ప్రవేశించరాదని తహసీల్దార్ ఇరువర్గాలకు ఎస్సై ద్వారా నోటీసులు పంపించారు. వాటిని తీసుకునేందుకు నిర్మాణం చేపడుతున్న మహిళ నిరాకరించి ఆయనతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్సై నోటీసును గోడకు అంటించి వెళ్లిపోయారు. ఇదేసమయంలో దేవదాయశాఖ ఈవో ఆ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

స్థలంపై తరుచూ వివాదం!

ఈ స్థలంపై రెండు వారాల నుంచి తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. మసీద్ వీధికి 23 అడుగుల దారి ఉండగా అందులో కొంత భాగాన్ని మహిళ ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నదని కొంత మంది స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ మాత్రం 23 అడుగుల దారి మసీద్ వీధిలో పై నుంచి కింద వరకు ఎక్కడా లేదంటున్నారు. ప్రధాన రహదారి పక్కన నిత్యం వివాదం చోటుచేసుకుంటుండటంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

నేడు అక్కినేని వర్ధంతి

● వందేమాతరం శ్రీనివాస్‌కు అవార్డు ప్రదానం

ఒంగోలు కల్చరల్, జనవరి21(ఆంధ్రజ్యోతి): అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి వేడుకలు బుధవారం జరగనున్నాయని సంస్థ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య తెలిపారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో సాయంత్రం 6 గంటల నుంచి అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాలలోని పాటలతో సంగీత విభావరి ఉంటుందన్నారు. ఇక ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్‌ను అక్కినేని నాగేశ్వరరావు అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ అవార్డును కె.విశ్వనాధ్, సుమన్, చంద్రమోహన్ వంటి పలువురు ప్రముఖులకు ఇచ్చామని పేర్కొన్నారు. కనుక సంగీతాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

నివాళులర్పించిన బీఎన్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, సరోజిని

సంతనూతలపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువారిపాలెంకు చెందిన దళితనాయకుడు నూతలపాటి వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న రిటైర్డ్ కలెక్టర్ దానం సతీమణి బి.సరోజిని, ఆయన కుమారుడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పూలమాలతో వెంకటసుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు, ఆర్.సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

క్విస్ ఫార్మసీలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమి, చంద్రలీల

ఒంగోలు విద్య, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై, మహిళాసంరక్షణ, సైబర్ క్రైమ్ పై మంగళవారం జిల్లా యువజన సంక్షేమశాఖ, ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రెసిడెంట్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీగాయత్రిలు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రలీల మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు అవుతున్న వారిలో చాలా మంది విద్యార్థులే ఉంటున్నారని, ఇది వారి భవిష్యత్‌ను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు తమకు పట్టుబడితే శిక్ష కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, యువజన సంక్షేమశాఖ అసిస్టెంట్ మేనేజర్ రాజా, పావని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

కొండపి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో అరికట్ల వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారన్ సోమవారం రాత్రి దగ్ధమైంది. దాన్ని అనకర్లపూడికి చెందిన వారు అద్దెకు తీసుకొని పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. అందులో ఉంచిన పొగాకు మొత్తం బూడిదైంది. రూ.4లక్షల మేర నష్టం వాటిల్లింది. జంటగా ఉన్న అరికట్ల వెంకటసుబ్బయ్యకు చెందిన బ్యారన్‌కు కూడా మంటలు అంటుకున్నాయి. అందులో పచ్చాకు మాత్రమే ఉండటంతో మంటలు వ్యాపించలేదు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

కంది పంట పరిశీలన

కొండపి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు మంగళవారం కొండపి, అనకర్లపూడి గ్రామాల్లో పర్యటించారు. కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న కందిలో మారుక మచ్చల పురుగు కనిపిస్తున్నదన్నారు. ఇది లేత ఆకులను, పూతను, పిందెలను కలిపి గూడుగా చేసుకుని కాయ అడుగు భాగంలో చిన్న రంధ్రాలు చేసి లోపలికి వెళ్లి గింజలను తింటుందని వివరించారు. నివారణకు మందుల పిచికారీ గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకటనారాయణ, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటలో నమోదు చేసుకోవాలి

టంగుటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రబీలో పంటలు సాగు చేసిన రైతులంతా విధిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత సూచించారు. కొణిజేడు, కారుమంచి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు, శనగ పంటలను రైతులతో కలిసి ఏవో పరిశీలించారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సౌమ్య, ఉద్యాన సహాయకురాలు సాయిలక్ష్మి, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి వరకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో, సమాజానికి ఉపయోగపడే అన్ని రంగాల్లో ప్రావిణ్యం సంపాదించుకోవాలన్నారు. అనంతరం క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, హెచ్ఎం ప్రమోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుకు సంబంధించిన వివిధ అంశాలపై మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.కుమార్, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, ఎంఈవో పి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. పోతవరం గ్రామంలో రీసర్వేపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లోని భూములను రీసర్వే చేసి తప్పిదాలను సరి చేస్తుందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి

మండల పరిషత్ సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

పలు అంశాలు ప్రస్తావన



అధికారులను ప్రశ్నిస్తున్న పొందూరు ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు

టంగుటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : 'సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా సకాలంలో స్పందించడం లేదు. మేము ప్రతిసారీ సమావేశానికి రావడం.. ప్రశ్నలు వేయడం, తిరిగి వెళ్లడం జరుగుతూనే ఉంది. ఇదే విధానం రెండేళ్లుగా కొనసాగుతోంది' అని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. టంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు అంశాలను ప్రస్తావించారు. పొందూరు ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అక్రమ అమ్మకాలను నిరోధించాలని అధికారులను ప్రతి సమావేశంలో కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలకు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి అడ్డుకట్ట వేయడంతో పాఠశాలలో మురుగు నీరు పెద్దత్తున నిల్వ ఉంటుందన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందన లేదన్నారు. అలాంటప్పుడు సమావేశాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అనంతవరం ఎంపీటీసీ సభ్యుడు కసుకుర్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ మా గ్రామ ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు ఇళ్ల మధ్య ప్రమాద భరితంగా ఉన్నాయన్నారు. వీటిని తొలగించాలని అనేక సమావేశాల్లో కోరినా ఫలితం లేదన్నారు. దీనిపై విద్యుత్ అధికారి సమాధానమిస్తూ.. తాము సమస్య పరిష్కారానికి ప్రయత్నించినా స్థానికులు అడ్డుకోవడం వలన వీలుపడలేదని చెప్పారు. ఈ సమయంలో ఎంపీపీ కోటేశ్వరమ్మ కలుగజేసుకొన్నారు. స్థలం ప్రభుత్వానిదా? ప్రైవేటు వ్యక్తులదా? అని ఆమె అధికారులను ప్రశ్నించారు. అందుకు వారు సమాధానమిస్తూ స్థలం ప్రభుత్వానిదే అయినా గ్రామస్థుల సహకారం లేకుండా తామేమి చేయగలమని బదులిచ్చారు. పీఆర్ ఏఈ శ్రీహరి మాట్లాడుతూ ఎంపీ గ్రాంట్ కింద అనంతవరానికి రెండు వర్క్‌లు మంజూరైనప్పటికీ వాటిని చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు వివిధ సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. వ్యవసాయ శాఖ ప్రతినిధి శ్రీనివాసులు, ఏపీవో సుభాషిణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

● జిల్లా అధ్యక్షుడు సంజీవకుమార్



మాట్లాడుతున్న సంజీవకుమార్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు పనిచేసిన కాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ కోరారు. స్థానిక కాపు సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కాపులకు ఒక్క ఎమ్మెల్యే టిక్కెట్ కూడా రాలేదన్నారు. రాష్ట్రంలో ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో కూడా జిల్లాలోని కాపులకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు మూడు లక్షల మంది కాపు ఓటర్లు ఉన్నా న్యాయం జరగడం లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఒడా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కోరారు. ఉపాధ్యక్షుడు చిల్లర హనుమంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాపులకు అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా ఆ జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో చింతపల్లి నారాయణ, నంద్యాల శ్రీనివాసరావు, మేకల నారాయణ, చెన్నంశెట్టి శివ, లింగిశెట్టి సుబ్బారావు, శెట్టి సుబ్రహ్మణ్యం, వీరబ్రహ్మం, పూటకూళ్ళ శ్రీనివాసరావు, రామకృష్ణ, బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు

● సీఐ హజరత్తయ్య హెచ్చరిక



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్

సింగరాయకొండ, జనవరి 21: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని డ్రైవర్లను సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిటెనెస్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆటోలో వెనుక, ముందు వైపు ప్రయాణికులను ఎక్కించకూడదని చెప్పారు. సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసినా జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

నాగులుప్పలపాడు: అనుమతికి మించి వ్యవసాయ, పచ్చాకు కూలీలను తరలిస్తున్న వాహనదారులకు పోలీసులు మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచే వ్యవసాయ పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోలు, ట్రాక్టర్‌లను నాగులుప్పలపాడులో పోలీసులు తనిఖీలు చేపట్టి అనుమతికి మించి వెళుతున్న వాహనాలను ఆపి కూలీలను దింపి స్టేషన్‌కు తరలించారు. దాంతో కూలీలు ఇబ్బందులు పడ్డారు. రైతులు సైతం ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రైతు సంఘం జిల్లా నాయకులు జె.జయంతిబాబు, తూబాటి శ్రీకాంత్ రైతులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని వ్యవసాయ పనుల సీజన్‌లో కూలీల వాహనాలు ఆపడం ద్వారా పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. నిబంధనల పేరుతో రైతులను, కూలీలను పోలీసులు ఇబ్బందులకు గురిచేయవద్దని ఎస్ఐ శ్రీకాంత్‌ను కోరారు. అదే సమయంలో ఓ కేసు విచారణలో భాగంగా వచ్చిన డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు దృష్టికి రైతు సంఘం నాయకులు సమస్యను తీసుకెళ్లారు.

అసత్య ప్రచారాలు తగదు : టీడీపీ

నాగులుప్పలపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యో తి): అమ్మనబ్రోలు గ్రామంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న కొట్లాటలు, వాటిపై నమోదైన పోలీస్ కేసులకు కారణం వైసీపీకి చెందిన గంజాయి బ్యాచే కారణమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం అమ్మనబ్రోలులో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. కొందరు యువకులు గంజాయికి బానిసలుగా మారి దాడులకు పాల్పడటమే కాకుండా తెలుగుదేశం పార్టీకి ఆపాదించడం సమంజసం కాదని హితవు పలికారు. కార్యక్రమంలో వలేటి రంగారావు, కందుకూరి రమణ, మహమద్ ఆజం, ఆంజనేయులు, తోటపల్లి ఆంజనేయులు, గౌతమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

కనిగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని వంగపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరికుంట దేవరాజు (20) విద్యుత్ లైన్‌మన్‌కు సహాయకుడిగా ఉంటుంటాడు. గ్రామంలో విద్యుత్ పోల్‌పై సమస్య తలెత్తడంతో లైన్‌మన్ దేవరాజును సరిచేయాల్సిందిగా పురమాయించాడు. దీంతో ఆయన స్తంభం ఎక్కగా షాక్ తగిలి కిందపడి మృతి చెందాడు. మృతుడు కావలిలోని కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. రెండు నెలల క్రితం అతని తల్లికి అనారోగ్య రీత్యా రెండు నెలలుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో కరెంటు పనులకు సహాయకుడిగా వెళ్తుంటాడు. మృతుడు తండ్రి చిట్టిబాబు బేల్దారి పనులు చేస్తుంటాడు. అతనికి మృతుడు దేవరాజుతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుమారుడు మరణించటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలి

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి ఉపాధి హామీ పథకంలో శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ముండ్లమూరు ఉపాధి హామీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ లతో సమావేశంలో మాట్లాడుతూ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుచేసి 40 నుంచి 50 మందికి ఒక మేట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వీరికి ఉపాధి హామీ కూలీతో పాటు అదనంగా మూడు రూపాయలు చెల్లిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు వందలకు పైగా సంఘాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లాలో 1134 మినీ గోకులం షెడ్లు మంజూరుకాగా, 590 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఇంకా ప్రతి గ్రామంలో రెండు షెడ్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. వీటికి పశువైద్యాధికారి సిఫార్సు చేసిన వెంటనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఉండేవిధంగా ఇంటి యాజమానులకు అవగాహన కల్పించాలని పీడీ అన్నారు. వచ్చే మార్చి నాటికి మూడు లక్షల 'ఉపాధి' పని దినాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం శంకరాపురంలో నిర్మించిన గోకులం షెడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూర పాటి శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణ స్వామి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లకు సన్మానం



ఎమ్మెల్యే దామచర్లను సన్మానిస్తున్న డివిజన్ నాయకులు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33వ డివిజన్‌లో మంగళవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, డివిజన్ అధ్యక్షులు నల్లూరి రవి, నాయకులు పాటిబండ్ల వెంకటేశ్వర్లు, ఎం.శ్రీమన్నారాయణ జి.కృష్ణమోహన్, యలమంద, ఎ.ప్రవీణ్, యోనా, జగన్నాధం మురళీ ఎమ్మెల్యే దామచర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. తనపై అభిమానంతో అభినందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సత్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ముస్లింపెద్దలు

మద్దిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావును జిల్లాకు చెందిన పలువురు ముస్లింపెద్దలు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఒంగోలులో జరిగిన తబ్లిక్ ఇస్తిమా కార్యక్రమానికి మూడు రోజుల పాటు నాగేశ్వరరావు ఉచితంగా మంచినీటిని సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో మదీనా మసీద్ ప్రతినిధులు స్థానిక నాగేశ్వరరావు గృహంలో ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మదీనా మసీదు కార్యదర్శి కరీముల్లా, కమిటీ సభ్యులు అబ్దుల్లా మౌలాఅబూబకర్, సిరాజుద్దీన్ నూరుల్లా షరీఫ్ దౌలత్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం కార్యాలయం వద్ద ప్రపంచ కార్మిక వర్గ నేత లెనిన్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు బి.సుబ్బారావు, చుండూరి రంగారావు, కరవది సుబ్బారావు, దాసరి సుందరం, కొంగర నరసింహం, ఏఎల్.ప్రసాద్, ఎం.జార్జి, ఎం.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులు కావాలి

మద్దిపాడు, జనవరి21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మహిళలు విద్యావంతులు కావాలని ఎంపీడీవో జ్యోతి కోరారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఉల్లాస్ విద్యా వలంటీర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బారావు, పోతు రాజు, విద్యావలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు వైద్యశిబిరాలు

సంతనూతలపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంతనూతలపాడు, పేర్నమిట్ట పశువైద్యులు ప్రతాప్‌రెడ్డి, చిరంజీవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో నట్టల నివారణ మందు తాగించడం, గొర్రెలకు, మేకలకు టీకాలు వేస్తామన్నారు. 22న గుర్వారెడ్డిపాలెం, ఎం.వేములపాడు, 23న చంద్రపాలెం, లక్ష్మీపురం, 24న రుద్రవరం, చిలకపాడు, 25న ఎనికపాడు, ఎండ్లూరు, 27న పీ.తక్కెళ్లపాడు, గుమ్మళంపాడు, 28న మైనంపాడు, 29న మద్దులూరు, మంగమూరు 30న కొనగానివారిపాలెం, 31 పి.గుడిపాడు గ్రామాల్లో పశువైద్యశిబిరాలు జరుగుతాయని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్‌కు పురస్కారం



పురస్కారం అందుకున్న చంద్రశేఖర్

ఒంగోలు విద్య, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని పని చేసే ప్రొఫెసర్ పగడాల చంద్రశేఖర్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. బెంగళూరులోని నాగార్జున డిగ్రీ కళాశాలలో వివేకానంద ఇంటర్నేషనల్ ప్రకృతి యోగా అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వబంధు డాక్టర్ నగేష్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక గ్లోబల్ భారత్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. బెంగళూరు చైతన్య గ్లోబల్ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ భాస్కర్‌పటేల్, ఏవో చంద్రశేఖర్, డీన్ రూపన్‌కుమార్, ఎఫ్‌వో మీరావలి, అసోసియేట్ డీన్ శివాంజనేయులు, కో ఆర్డినేటర్ రవిచంద్ర, పీడీ హెడ్ భాస్కర్, లావణ్య, సరిత తదితరులు అభినందించారు.

ఏఎంవో, ఏపీవో పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి

ఒంగోలు విద్య, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో ఖాళీగా ఉన్న ఏఎంవో, ఏపీవో పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అర్రెబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మూడు నెలల క్రితం ఏఎంవో పోస్టుకు నోటిఫికేషన్ ఇవ్వకుండా గతంలో ఉన్న వారినే కొనసాగించేందుకు ఫైల్ సిద్ధం చేస్తుండటంతో ఈ విషయం కలెక్టర్‌కు తెలిసి నిలుపుదల చేశారని పేర్కొన్నారు. ఆయా పోస్టులను తాత్సారం లేకుండా వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు జీతాలు మంజూరు చేయాలి

ఒంగోలు విద్య, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిగా జీతాలు లేకుండా ఇబ్బందులు పడుతున్న ఎయిడెడ్ టీచర్లకు వెంటనే జీతాలు ఇప్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పర్చూరు మండలం చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లు వలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆ పాఠశాల యాజమాన్యం గత ఏడాదిగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు పేర్కొన్నారు. కొమరోలు మండలం గోపానపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డి.ఆంజనేయులు కూడా జీతాల సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని జీతాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ప్రసన్నరాజు

ఒంగోలు క్రైం, జనవరి21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మన్నం ప్రసన్నరాజును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా నియామకపత్రాన్ని అందజేశారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత రాష్ట్ర అధ్యక్షులుగా షర్మిలారెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నరాజు మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన షర్మిలారెడ్డిని కృతజ్ఞతలు పలువురు నాయకులు ప్రసన్నరాజును శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాలపర్తి విజేష్‌రాజు, కైపు వెంకటకృష్ణారెడ్డి, బొడ్డు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణ కేంద్రం పరిశీలన



సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

నాగులుప్పలపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామమైన చిన్నంగారి పట్టపుపాలెంలో అటవీశాఖ, ట్రీఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారి కె.వినోద్‌కుమార్ పరిశీలించారు. రక్షకదళ సభ్యులు నిరంతరం తీరంలో అందుబాటులో ఉండి తాబేళ్లను హేచరీలలో ఉంచి సంరక్షణ చూడాలని సూచించారు. గ్రామస్థులు సముద్ర తాబేళ్ల మనుగడకు ఆటంకం కలిగించవద్దని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా సమన్వయకర్త శవనం చంద్ర, ఎఫ్ఆర్‌వో బి.నరసింహారావు, కె.మోహనరావు, శశిభూషణ్‌రావు ఉన్నారు.

చీమకుర్తి నాగేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బదరినారాయణ, డాక్టర్ జవహర్

చీమకుర్తి, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు, సత్యహరిశ్చంద్రుడు పాత్ర ద్వారా తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన చీమకుర్తి నాగేశ్వరరావుకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకొని చీమకుర్తిలో ఉన్న ఆయన విగ్రహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరినారాయణ, డాక్టర్ బి.జవహర్, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు,కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాటిబండ్ల రాజసులోచన, బండ్ల డేవిడ్, షేక్ ఖాదర్‌బాష, పిన్నక శ్రీనివాసరావు, ఇస్తర్ల శంకర్, చింతలపాలెం బాబు, నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

నాగులుప్పలపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ఈర్ల సాయి తనను కులం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన కొమరిగిరి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కులదూషణ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు గ్రామంలో విచారణ చేపట్టారు. స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

జ్వరపీడితులకు పరామర్శ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కొండపి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిదేపి ఎస్సీ కాలనీల్లో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించారు. జ్వర పీడితులను పరామర్శించారు. గ్రామంలో అపరిశుభ్రత కారణంగా తమకు జ్వరాలు వచ్చాయని పలువురు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో నాలుగు రోజులపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వారికి చెప్పారు. ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేయాలని పెట్లూరు పీహెచ్‌సీ డాక్టర్ పి.అనూషను ఆదేశించారు.

అవీ..ఇవీ

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



గిద్దలూరులో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

గిద్దలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాచర్ల పోలీసులు ఆటోడ్రైవర్లకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై కోటేశ్వరరావు ఆటోడ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను గాని, వ్యవసాయ కూలీలను గాని ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు. అలాగే ఆటో వెనుక భాగాన ఉండే డోర్లను ఎప్పుడూ మూసివేసి ఉంచాలన్నారు. ఆటో వెనుక వైపు ప్రయాణికులను కూర్చోపెట్టవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే ఆటోలను సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పరిమితికి మించి ఆటోలో ప్రయాణించడం నేరం

కంభం : కంభం మండలం పెద్దనల్లకాల్వ సమీపంలో ఓ ఆటోలో 20 మందికి పైగా ప్రయాణం చేస్తున్న మిర్చి కూలీలను కంభం ఎస్సై నరసింహారావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల ఆటోలలో, ట్రాక్టర్లలో పరిమితికి మించి ప్రయాణం ప్రమాదాలకు గురై ప్రాణాలు, అవయవాలు కోల్పోతున్న కూలీల సంఘటనలు విదితమే. బేస్తవారపేట మండలం మోక్షగుండం సమీపంలో ఆటో వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న కూలీలు కిందపడి ఇరువురు మరణించగా పలువురికి గాయాలైన సంఘటన విదితమే. ఈనేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయ రహదారిలో ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేసే వాహనాలను నిలిపి కూలీలకు, ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. ఆటోలో నలుగురికి మించి ప్రయాణం చేస్తే ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేయడమే కాక ఆటోలను సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

మార్కాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా మార్కాపురంలో టీడీపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి తెలిపారు. స్థానిక బొగ్గరపు కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఈ నెల 23న గురువారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, స్వచ్ఛంద రక్తదాతలు అందరూ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

పింఛన్‌దారులను పరిశీలించిన వైద్యబృందం



పెన్షన్‌దారుల వివరాలను తెలుసుకుంటున్న సిబ్బంది

మార్కాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ పరిధిలో మంచానికే పరిమితమై (కండరాల వ్యాధి, పక్షవాతము) పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం వైద్యబృందం ఇంటింటికి వెళ్లి పరిశీలించింది. మొత్తం 21 సచివాలయాల పరిధిలో 17 మంది నెలకు రూ.15 వేలు చొప్పున పింఛన్ పొందుతున్నారు. వారిలో అనర్హులెవరైనా ఉన్నారా? అని వాస్తవ ఆరోగ్య పరిస్థితిని అన్ని విధాలుగా వైద్యబృందం తనిఖీ చేసింది. వైద్యబృందం డాక్టర్ జి.హవిలా, డాక్టర్ టి.వైద్య సంజీవ్, డాక్టర్ జె.రోహిత్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న శ్రీధర్‌నాయుడు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతమైన ఎర్రగొండపాలెం పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సారథ్యంలో మెగాజాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాలో స్కిల్ స్టేట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పలు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి. చౌడయ్య తెలిపారు. వారి వద్ద నుండి 19,500 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయిలో వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీలను విద్యార్థులకు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.బాలకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పోటీలలో విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఓటు నమోదు, ఓటుహక్కు, ఓటుకు ఉన్న ప్రాధాన్యాత గురించి విద్యార్థులకు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్ చంద్రశేఖరరావు వివరించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 25న తహసీల్దారు కార్యాలయంలో జరిగే ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో అందజేయనున్నట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సినీయర్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చీమకుర్తి నాగేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బదరినారాయణ, డాక్టర్ జవహర్

చీమకుర్తి, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు, సత్యహరిశ్చంద్రుడు పాత్ర ద్వారా తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన చీమకుర్తి నాగేశ్వరరావుకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావు వర్థంతిని పురస్కరించుకొని చీమకుర్తిలో ఉన్న ఆయన విగ్రహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరినారాయణ, డాక్టర్ బి.జవహర్, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు,కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాటిబండ్ల రాజసులోచన, బండ్ల డేవిడ్, షేక్ ఖాదర్‌బాషా, పిన్నక శ్రీనివాసరావు, ఇస్తర్ల శంకర్, చింతలపాలెం బాబు, నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకూ అవస్థలే

● సమస్యల వలయంలో హిందూ శ్మశానవాటిక ● చిట్టడవిని తలపిస్తున్న చిల్లచెట్లు



చిల్లచెట్లతో చిట్టడవిని తలపిస్తున్న హిందూశ్మశాన వాటిక

మార్కాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో సమస్యలు తిష్టవేశాయి. ఏళ్లగా ఎవరూ పట్టించుకోక పోవడంతో పరిష్కారమార్గం లేక అంతిమ సంస్కారాలకు ఆటంకం కలుగుతోంది.

గతంలో మున్సిపాలిటీ, స్వచ్ఛంద సంస్థల ఆర్థిక తోడ్పాటుతో ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలు కొనసాగాయి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణ జనాభాలో సగం మంది అంతిమ సంస్కారాలు చేసుకునే శ్మశానంపై నిర్లక్ష్యం కొనసాగింది. అటు పాలకులు, ఇటు స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా గాలికొదిలేయడంతో సుమారు 30 వేల మంది జనాభాకు ఉపయోగపడే శ్మశానంలో సమస్యలు తిష్టవేశాయి. ప్రస్తుతం దహనం వరకు కొంత వరకు ఇబ్బందులు లేకున్నా పూడ్చిపెట్టే కార్యక్రమాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. సుమారు 4 ఎకరాల మేర స్థలం ఉన్నా నిర్వహణ సక్రమంగా లేక చిట్టడివిని తలపిస్తోంది. దీంతో స్మశానానికి సమీపంలోని వాగులో అంతిమ సంస్కారాలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

- పట్టించుకోని పాలకులు

వాస్తవానికి గతంలో మున్సిపాలిటీ హిందూ శ్మశానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. కేవలం ఎకరాలో ఉన్న స్మశానాన్ని సుమారు 5 ఎకరాలకు విస్తరించారు. 2014 నుంచి 2019 మధ్యకాలంలో అప్పట్లో మార్కాపురం ఆర్డీవోగా పనిచేసిన చంద్రశేఖర్ సర్వే నెంబర్ 280/1సి1లో 2.89 ఎకరాలు, 281/4లో 0.55 ఎకరాలను మృతదేహాలను పూడ్చేందుకు కేటాయించి హద్దులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా శ్మశానస్థలంగా మార్పు చేశారు. అప్పట్లో మున్సిపాలిటీ కూడా చుట్టూ ప్రహరీ, సీసీ రహదారులు నిర్మించింది. స్వచ్ఛంద సంస్థలు అక్కడ శివుని విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశాయి. కొన్నాళ్ల పాటు నిర్వహణ సరిగానే జరిగింది. కానీ తర్వాత కాలంలో మున్సిపాలిటీ శ్మశాన నిర్వహణను పట్టించుకోవడం మానేసింది. దీంతో అంతిమ సంస్కారాలు చేసుకోవడానికి నేడు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఇటీవల హిందూ శ్మశాన వాటిక కమిటీ సభ్యులు మున్సిపాలిటీకి వెళ్లి సమస్యను తెలియజేసినా వారు తమ పరిధిలో లేదని చేతులు దులుపుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి శ్మశానంలో ఉన్న చిల్లచెట్లను తొలగిస్తే ప్రస్తుతానికి అవస్థలు తప్పినట్టేనని పలువురు భావిస్తున్నారు.

పశ్చిమ ప్రకాశంలో విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తాం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ



నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో అందరి కృషితో విద్యా సదుపాయాలు మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం 2280 నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 23వ తేదీ లోకేష్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే ఉన్నత లక్ష్యం ఎంచుకుని కష్టపడి ఆ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ ప్రాంతం నుంచి ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 ఆఫీసర్లు తయా రు కావాలన్నారు. దానికి తగ్గట్టుగా తనవంతు సహాయం అందిస్తామ న్నారు. ఈ ఏడాది లోకేశ్ జన్మదినం సందర్భంగా పాఠశాలలో ఏదో ఒక కార్యక్రమం చేపడతామ న్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ నాగూర్ ఖాన్, టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, తాళ్లపల్లి సత్యనారాయణ, ఎం.వెంకటరెడ్డి, ఎ.శ్రీనివాసులు, మొఘల్‌షాకీర్ బేగ్, ఆలంపల్లి శ్రీనివాసులు, పఠాన్ ఇబ్రహీం ఖాన్, ప్రముఖ పారిశ్రామికవేత్త పోలెబోయిన లక్ష్మీనారాయణ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధువర్మ, హరిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

గిద్దలూరుటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొనే విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిష్కరించాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. మంగళవారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సును నిర్వహించారు. సమావేశంలో చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ ప్రజలు విద్యుత్ సమస్యలు చిన్న చిన్నవి పరిష్కారం కాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన వినియోగదారులు 35 దరఖాస్తులను పలు విద్యుత్ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలోని పాండురంగారెడ్డి నగర్, నల్లబండ బజారులో లోవోల్టేజ్ సమస్య వేదిస్తోందని పరిష్కరించాలని వినియోగదారులు వినతిపత్రాలు అందించారు. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు మరమ్మతుకు గురయ్యాయని, వాటిని మార్చాలని విజ్ఞప్తి చేశారు. పలువురు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు అధిక విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, పరిష్కరించాలని కోరారు. . కార్యక్రమంలో కోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఏ.సునిత, కె.వెంకటేశ్వర్లు, మార్కాపురం ఎగ్జిక్యూటివ్ పీవీ.నాగేశ్వరరావు, డివిజన్‌లోని ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పశుసంవర్ధక శాఖ ఏడీఏ బాలునాయక్



కొమరోలులో వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి). గ్రామాలలో పశుపోషకుల కోసం ప్రభుత్వ నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీఏ చిన్న బాలునాయక్ తెలిపారు. మండలంలోని దరిమడుగు, కొండేపల్లి, కొట్టాలపల్లి, నాయుడుపల్లి గ్రామాలలో పశువైద్యులతో మంగళవారం పశువైద్య శిబిరాలను నిర్వహించి పశువులను వ్యాధుల నివారణ, బలం మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలు నాయక్ మాట్లాడుతూ ఈ పశువైద్య శిబిరంలో గొర్రెలకు, మేకలకు, దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందు లను గర్భకోశ వ్యాధుల నివారణ మందు లను పశుపోషకుల యజ మానులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు అశోక్ కుమార్, సిబ్బంది అనిత, సుబ్బారావు, సాయితేజ, తేజస్విని, కోటిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొమరోలు : పశువులలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి గజ్జలకొండ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పుల్లారెడ్డిపల్లి గ్రామంలో పశుఆరోగ్య శిబిరాలను మంగళ వారం ఆ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు నారాయణ మాట్లా డుతూ పశువులు ఉండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నాగార్జున, శ్రీనివాసులు, కొండారెడ్డి, చానిక్య, నీలిమా, కరీష్మ, గోపాలమిత్రలు రవికుమార్, రైతులు పాల్గొన్నారు.



మార్కాపురంలో మందులు అందజేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల : మండలంలోని కటకానిపల్లె గ్రామంలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి అరుణ్ కుమార్ గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు, లేగదూడలకు నట్టల నట్టల నివారణ మందులు అందజేశారు. పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 34 గేదెలు, 24 ఎద్దులు, 20 దూడలు, 1000 గొర్రెలు, 800 మేకలకు పలు వ్యాధులకు కిత్సలు నిర్వహించి నివారణ మందులు అందజేసినట్లు తెలిపారు. పశుపోషణ, యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



అన్న క్యాంటీన్ పనితీరు గురించి తెలుసుకుంటున్న కమిషనర్

గిద్దలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేసేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. సిబ్బంది పనితీరు, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రత ఎలా ఉందని, ఆహారం బాగా ఉందా?, లేదా?, అని అడిగి తెలుసుకున్నారు. భోజనానికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, తాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆదర్శనీయుడు రావులపల్లి చెంచయ్య

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతం కోసం ఉన్నతమైన ఉద్యోగాన్ని వదులుకుని భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసిన ఆదర్శనీయుడు, ధన్యజీవి రావులపల్లి చెంచయ్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రావులపల్లి చెంచయ్య 17వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత చెంచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. అధికారంతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమై పలు సమస్యలపై పోరాడిన నాయకుడు చెంచయ్య అన్నారు. చెంచయ్య చేసిన ప్రజాపోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం, పెద్దన్న, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దేశ పురోగతిలో యువతే కీలకం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

మార్కాపురం వన్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశ పురోగతిలో యువత కీలకం అని సబ్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన కార్యక్రమం లో భాగంగా శ్రీ సాధన డిగ్రీ కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, డీటీ ప్రభావతి, సుబ్బారావు, ప్రిన్సిపాల్ కె.మధుసూధన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త ఎం.శేషుకుమార్, అకడమిక్ ఇన్‌చార్జ్ ప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన కాసుల వెంకటేశ్వరరావు

త్రిపురాంతకం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడు, కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా కాసుల వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ టూరిజం చైర్మన్ అనుమాలశెట్టి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, గోళ్ల సుబ్బారావు, మండల మాజీ అధ్యక్షుడు చీతిరాల హనుమంతరావు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులుగా ఎదగాలి

పొదిలి/కొనకనమిట్ల, జనవరి21 (ఆంధ్రజ్యోతి) : మహిళలు విద్యావంతులుగా ఎదగాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో పొదిలి, కొనకనమిట్లలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణలు, బుక్స్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాక్షరాస్యులైన ప్రతి మహిళలను విద్యావంతులను చేయ డమే ఉల్లాస్ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు గోపాలకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీతో మేలు



చింతగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

తర్లుపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగుచేసిన పంటలకు పంట నమోదు చేయించుకున్న తర్వాత రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ కూడా చేయించుకోవాలని వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లెలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరప, కంది, మినుము పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ.. మిరప పంటపై ప్రస్తుతం కొమ్మ ఎండుతెగులు ఉధృతంగా ఉందన్నారు. ఈ తెగులు నివారణకు వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జె.సౌజ న్య, గ్రామ వ్యవసాయ సహాయకులు దేవేంద్ర, బొర్రయ్య, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

ఈ అప్లికేషన్‌పై అవగాహన కలిగి ఉండాలి

గిద్దలూరు టౌన్ : రైతులు ఈ-అప్లికేషన్‌పై అవగాహన కలిగి ఉండాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంచిపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఈ అప్లికేషన్ ద్వారా రైతులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పురుగులు, తెగుళ్ల ఫొటో తీసి వాటిని సంబంధిత అధికారులకు అప్‌లోడ్ చేస్తే వాటి నివారణ చర్యలకు సూచనలు అందజేస్తామన్నారు. అందుకు సంబంధించి మందులను పిచికారి చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫార్మర్ రిజిస్టర్ కార్యక్రమం గురించి రైతులకు వివరించారు. దీని ద్వారా ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నబి, యూనస్, రైతులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : సాగులో ఉన్న మిరపలో ప్రస్తుతం కొమ్మ ఎండు తెగులు ఉందని దాని నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని పుల్లలచెరువు మండల వ్యసాయయశాఖ అధికారి పి. నిర్మలాదేవి అన్నారు. మంగళవారం పోలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పెద్ద పీఆర్‌సీ తండాలో సాగులో వున్న మిరప, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాఫ్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. మిరపలో ఎండు తెగులు నివారణకు పకృతి వ్యవసాయం ద్వారా తగ్గించవచ్చునని అన్నారు. దీని కోసం 2 కిలోల సీతాఫలం ఆకులు, ఒక కేజీ కలబందను తీసుకొని మెత్తగా నూరి ఆవు పంచకముతో 2 రోజులు నానబెట్టి తరువాత ఒక ఎకరా పోలములో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు నాయక్‌రైతులు పాలొన్నారు.

ఈ క్రాఫ్ నమోదు తప్పనిసరి

ఎర్రగొండపాలెం రూరల్ : రబీలో సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాఫ్ నమోదు చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కేవీ. శేషారెడ్డి సూచించారు. మంగళవారం చెర్లొతాండా గ్రామంలో రైతులు సాగు చేసిన పంటపొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, సిబ్బంది మంత్రునాయక్, ఆదిలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఈ-పంటతో పాటుగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు కోరారు. మండలంలోని చింతగుంట్ల, రాయవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న శనగ, కంది పంటలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, వెంకట్, రైతులు పాల్గొన్నారు.

మిరప పైరు పరిశీలన

గిద్దలూరు : మండలంలోని ఉప్పలపాడు గ్రామ పరిధిలో సాగైన మిరప పైరును ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ మంగళవారం పరిశీలించారు. సాగైన మిరపలో తామర పురుగు, తెల్లదోమ ఉన్నట్లు గుర్తించారు. విప్రోనిల్ లేదా స్పైనోసాడ్ మందులను నివారణ కోసం పిచికారి చేయాలని రైతులకు సూచించారు. శిలీంద్రాల వలన ఆకుమచ్చ, కాయమచ్చ వస్తోందన్నారు. ఈ మచ్చ తగ్గించుకునేందుకు ఎం-45 మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

పెద్దదోర్నాల : మండలంలోని రామచంద్రకోట, కటకానిపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మినుము, శనగ పైర్లను పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ శ్వేత,ఏఈవో చైతన్యకుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పామూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ టి.కిశోర్‌బాబు పేర్కొన్నారు. వీటిని పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు మంగళవారం పలు సూచనలు చేశారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం పత్రాలను లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాయింగ్ విభాగంలో సీఎస్‌పురం విద్యార్థికి ద్వితీయ బహుమతి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాల వేదికగా మంగళవారం నిర్వహించారు. డ్రాయింగ్ విభాగంలో సీఎస్‌పురం మండలం అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గంధం ప్రవీణ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు తెలిపారు. జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థి రాణించడం పట్ల హెచ్‌ఎం ఆర్.హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సదస్సును జయప్రదం చేయాలి

దొనకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వెలిగొండ జలాల సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 23న కనిగిరిలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆపార్టీ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం దొనకొండలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కుందుర్తి నర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, మేకం సంతోష్‌కుమార్, మేకం ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

కురిచేడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఈనెల 19న కలుసుకున్నారు. వారంతా కలసి తాము చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే ప్రింటర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సాయి కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి

పామూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పన్నులు వసూలుచేసి పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని డీఎల్‌పీవో ఎంవీఎల్ హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో సంపూర్ణ పారిశుద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో బి.సురేష్, ఈవోపీఆర్డీ కేఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిశు ఆధార్ నమోదు

పామూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు గ్రామ సచివాలయం కేంద్రంలో మంగళవారం శిశు ఆధార్ నమోదును ప్రారంభించారు. అంగన్‌వాడీ పిల్లలకు బాల ఆధార్ నమోదు మాత్రమే జరుగుతుందని డిజిటల్ అసిస్టెంట్ మహేష్ తెలిపారు.

శనగ పైరును ఆశించిన ఎండు తెగులు

పామూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు సాగుచేసిన వరి, కంది, శనగ పైర్లను మ మండల వ్యవసాయాధికారి కె.రాధ మంగళవారం పరిశీలించారు. మండలంలోని వగ్గంపల్లి, రావిగుంటపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పైర్లను పరిశీలించారు. శనగకు ఎండు తెగులు, కందిలో గూడు పురుగు ఆశించినట్టు గుర్తించారు. వీటి నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా అమలుజరిగే వివిధ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, వీఏఏలు శ్రీనాద్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల పరిశీలన

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం, బొప్పూడివారిపాలెం, ఈదర, వేములబండ, చింతలపూడి, పసుపుగల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంతో నిర్మించిన సీసీ రోడ్లను పంచాయతీ రాజ్ శాఖ, క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. సీసీ రోడ్ల నాణ్యతను డ్రిల్ ద్వారా పరిశీలించారు. రహదారులన్నీ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు లేకపోతే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చేయటం జరగదన్నారు. కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా శ్రమశక్తి సంఘాలను ఏర్పాటుచేయాలి

- జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలి
- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్


శంకరాపురంలో గోకుల షెడ్డును పరిశీలించిన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి ఉపాధి హామీ పథకంలో శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటుచేయాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశంలో మాట్లాడుతూ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుచేసి 40 నుంచి 50 మందికి ఒక మేట్‌ను ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. వీరికి ఉపాధి హామీ కూలీతో పాటు అదనంగా మూడు రూపాయలు చెల్లిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు వందలకు పైగా సంఘాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ సంఘాలు ఏర్పాటుతో ఉపాధి హామీ పనులు వేగవంతమవుతాయన్నారు. జిల్లాలో 1134 మినీ గోకులం షెడ్లు మంజూరుకాగా, 590 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గోకులం షెడ్లతో పశుపోషకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంకా ప్రతి గ్రామంలో రెండు షెడ్లు మంజూరుచేస్తున్నట్టు చెప్పారు. వీటికి పశువైద్యాధికారి సర్టిఫికెట్ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సదరు డాక్టర్ సిఫార్సు చేసిన వెంటనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి రైతు పొలంలో పారం ఫండ్స్ ఏర్పాటు చేసుకొనే విధంగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఉండేవిధంగా ఇంటి యాజమానులకు అవగాహన కల్పించాలని పీడీ జోసెఫ్‌కుమార్ అన్నారు. వచ్చే మార్చి నాటికి మూడు లక్షల 'ఉపాధి' పని దినాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటి వరకు ముండ్లమూరు మండలంలో శంకరాపురం, ఉల్లగల్లులో తప్ప మిగతా గ్రామాల్లో ఉపాధి హామి పనులు మొదలు పెట్టలేదన్నారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీడీ లలితకుమారి, ఏపీవో నాగరాజులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై సస్పెండ్‌కు వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం శంకరాపురంలో నిర్మించిన గోకులం షెడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణ స్వామి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

- ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి


కురిచేడు: గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కురిచేడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో భూసమస్యలు పరిష్కారమవుతాయని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి అన్నారు. కురిచేడు మండలం పేరుంబొట్లపాలెంలో మంగళవారం రీసర్వేపై జరిగిన గ్రామ సభకు తహసీల్దార్ రజనీకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి భూ సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవాలని సూచించారు. మ్యుటేషన్ కూడా చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వో సరోజిని, సర్వేయర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సరిదిద్దేందుకే రీసర్వే

దర్శి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతంలో నెలకొన్న లోపాలను సరిదిద్దేందుకే రీసర్వే చేపట్టినట్టు ఆర్డీవో కేశవర్ధనరెడ్డి తెలిపారు. మండలంలోని బుక్కాపురం రెవెన్యూ గ్రామాన్ని రెండో దశలో రీసర్వేకు ఎంపిక చేశారు. అందులోభాగంగా మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల్లో ఏమైనా లోపాలుంటే సంబంధిత వ్యక్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ బుక్కాపురం గ్రామంలో 488 మంది రైతులకు 1636.96 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా హద్దుల లోపాలు సరిచేయటం, రికార్డులు క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం ఐదు నుంచి ఉదయం 11 గంటల వరకు మంచు దుప్పటి కప్పేసింది. రహదారులను పూర్తిగా మంచు కమ్మివేసింది. దీంతో వాహన చోదకులు కనీసం అడుగు ముందుకు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు వాహనచోదకులు లైట్లు వేసుకొని వెళ్లగా, మరికొందరు రహదారి పక్కన నిలిచిపోయారు. మండలంలోని అద్దంకి - దర్శి ప్రధాన రహదారితో పాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారులను మంచు కమ్మేసింది.



వేములబండ వద్ద రహదారిని కమ్మేసిన మంచు, రమణారెడ్డిపాలెం వద్ద దట్టంగా ఉన్న మంచు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

పామూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. పశు సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం అమలు పరుస్తున్న మినీ గోకులం పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని సుచ్చుపొద గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసిన గోకులం షెడ్డును ఎంపీడీవో బి.సురేష్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పువ్వాడి మాట్లాడుతూ పశువులకు రక్షణ సౌకర్యం కోసం గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ రెండోవిడత కింద ప్రతి గ్రామ పంచాయతీకి మరో రెండు మినీ గోకులం షెడ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కేవీ రమణయ్య, వై.రహీముల్లా ఎం.హుసేన్‌రావు, ఇర్రి కోటిరెడ్డి, దేవరపు మాల్యాద్రి, దాసరి మాలకొండయ్య, దేవరపు రమణమ్మ, కె.రామకృష్ణ, ఏపీవో బి.మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి షేక్ ఆదాంబి, ఫీల్డ్ అసిస్టెంట్ కొలూరి హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


దేవరాజు (ఫైల్)

కనిగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని వంగపాడులో చోటుచేసుకుంది. మృతుని తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరికుంట దేవరాజు (20) విద్యుత్ లైన్‌మన్‌కు సహాయకుడిగా ఉంటుంటాడు. గ్రామంలో విద్యుత్ పోల్‌పై సమస్య తలెత్తడంతో లైన్‌మన్ మృతుడు దేవరాజును సరిచేయాల్సిందిగా పురమాయించాడు. దీంతో మృతుడు పోల్‌పైకి ఎక్కడంతో ఒక్కసారిగా షాక్ తగిలి కిందపడి మృతి చెందాడు. మృతుడు కావలిలోని కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. రెండు నెలల క్రితం అతని తల్లికి అనారోగ్యరీత్యా రెండు నెలలుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో కరెంటు పనులకు సహాయకుడిగా వెళ్తుంటాడు. విద్యుత్ పోల్‌పై ఎక్కటంతో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడు తండ్రి చిట్టిబాబు బేల్దారి పనులు చేస్తుంటాడు. అతనికి మృతుడు దేవరాజుతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడి మరణించటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో హనుమంతరావు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

పామూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతీలో పనులు చేపట్టకుండనే నిధులు దుర్వినియోగంపై డీఎల్‌పీవో హనుమంతరావు మంగళవారం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ గ్రామానికి చెందిన మల్లెల శ్రీనివాసులు గత డిసెంబరు 2న మీకోసంలో ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో మంగళవారం పంచాయతి కార్యాలయాన్ని పరిశీలించారు. పనులకు సంబంధించిన రికార్డులు, పనులు చేపట్టకుండానే చేసినట్లు చెబుతున్న వాటర్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇందుకుసంబంధించి జిల్లా ఉన్నాతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేష్, ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోల్‌రాజు, కార్యదర్శి రాంప్రసాద్, సర్పంచ్ వెంకటకొండమ్మ, వీఆర్వో ఖాజావలి, ఫిర్యాదుదారుడు మల్లెల శ్రీనివాసులు, మన్నం రమణయ్య, గోళ్ల వీరబాబు, యాదాల చెన్నకేశవులు, ఏలూరి నరసింహారావు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న గ్రానైట్ లారీలు పట్టివేత


ఓవర్ లోడుతో వెళ్తున్న గ్రానైట్ లారీలను ఆపి కేసులు నమోదు చేస్తున్న రవికుమార్

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మీదుగా అధిక లోడుతో మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు వెళ్తున్న రెండు గ్రానైట్ లారీలను మంగళవారం ఉదయం దర్శి మోటారు వాహనాల తనిఖీ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ పట్టుకున్నారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రవ్వవరం సమీపంలోని గ్రానైట్ క్వారీల నుంచి రాళ్ళను తీసుకెళతున్నాయి. అందిన సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తన సిబ్బందితో వచ్చి పట్టుకున్నారు. పరిమితికి మించి అధిక లోడు ఉండటంతో ఒక్కో లారీకి రూ.40 వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్టు రవి కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ జాన్సన్

బీఎల్‌వోలు సక్రమంగా విధులు నిర్వహించాలి

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బూత్ లెవల్ ఆఫీసర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి, దర్శి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ .జాన్సన్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బీఎల్‌వో వారి పరిధిలో కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. అలాగే, అర్హత ఉన్నవారు నమోదు చేయించుకొనే విధంగా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ డీటీ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దొనకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రసముద్రంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రుద్రసముద్రంకు చెందిన మాట వెంకటేశ్వర్లు తన ఇంటి పక్కనే నివసిస్తున్న డి.మల్లికార్జున భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లును మందలించేందుకు వారి ఇంటి వద్దకు మల్లికార్జున వెళ్లాడు. ఆసమయంలో వెంకటేశ్వర్లు ఇంట్లో లేకపోవటంతో ఆయన భార్య భయపడి బయటకు వెళ్లిపోయింది. ఆవేశంతో మల్లికార్జున, అతని అనుచరులు వెంకటేశ్వర్లు ఇంటి పక్కన ఉన్న రేకులషెడ్డును ధ్వంసం చేసి తగులబెట్టినట్లు తెలిపారు. ఈఘటనపై ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో త్రిపురాంతకం సీఐ హస్సాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీసీపల్లి పశు వైద్యాధికారి ఆవుల రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దన్నపల్లి, మర్రికుంటపల్లి గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో గొర్రెలు, మేకలు, గేదెలు తదితర పశువులను పరీక్షించిన ఆయన వ్యాధి సోకిన జీవాలకు అవసరమైన మందులు ఇచ్చారు. అనంతరం పశుపోషకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో జీవాలకు గొంతువాపు, బొబ్బవ్యాధి సోకే ప్రమాదముందన్నారు. ఈ వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ సరఫరా చేసిందని చెప్పారు. పశుపోషకులు తమ జీవాలకు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పశు పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో..

సీఎస్‌పురం(పామూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రాథమిక గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు తోడేటి గోపి అన్నారు. మంగళవారం సీఎస్‌పురం మండలంలోని చెన్నపునాయినిపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్‌బాషాతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనుముల పెదసుబ్బయ్య, పశువైద్య సహాయకులు నూర్జహాన్‌గౌస్య, హనుమంత్, శివనారాయణ, వెంకటేశ్వర్లు, నవీన్, వినీత్‌బాబు పాల్గొన్నారు.

రాగులు సాగు చేయాలి

తాళ్లూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రాగులు, కొర్రలు పంటలు సాగు చేసుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం శివరాంపురం, మాధవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబ డినిచ్చే రాగిలో మేలు జాతి రకం గోదావరి, శ్రీచైతన్య, హేమ(తెల్లరాగి), సువర్ణముఖి, ఇంద్రావతి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకానికి నాలుగు కిలోలను వెదజల్లే పద్ధతిలో పంటనుసాగు చేయాలన్నారు. కొర్రపంటలో అధిక దిడుబడి నిచ్చే సూర్య నంది, మహానంది రకాలు సాగు చేయాలన్నారు. ఈ పంటల దుక్కిలో ఎకరాకు ఐదు టన్నుల పశువుల ఎరువును వేసి కలియదున్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం రామిరెడ్డి, వీఏఏ ఎం.రాజు, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా రీసర్వే చేయాలి

పీసీపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో చేపడుతున్న రీసర్వేలో రైతులకు సమస్యలు తలెత్తకుండా భూములు రీసర్వే చేయాలని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. మంగళవారం మండలంలోని వితలాపురంలో జరుగుతున్న రీసర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే జరుగుతున్న సమయంలో రైతులు తమవద్ద ఉన్న పొలం తాలూకు పాసుపుస్తకాలు తీసుకురావాలని కోరారు. రికార్డులో ఉన్న విస్తీర్ణం, ఆన్‌లైన్‌లో ఉన్న విస్తీర్ణం, అనుభవంలో ఉన్న విస్తీర్ణం పక్కాగా కొలతలు తీసి రికార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వేలో వ్యత్యాసాలు, పొరపాట్లు ఉంటే రైతులు వెంటనే రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. సర్వే జరుగుతున్న సమయంలో రైతులందరూ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని వినతి

పీసీపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలంటూ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1994లో మెట్లవారిపాలెం, కోదండరామాపురం గ్రామాలకు చెందిన 22మంది దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 24ఎకరాలు పంపిణీ చేశారు. ఆతరువాత కొంతమంది తమ పేర్లపై ఆన్‌లైన్ చేయించుకున్నారని అన్నారు. అధికారులు విచారణ జరిపి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు పొందిన అసలైన లబ్ధిదారులకు వారిపేరున ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

కంది పైరును పరిశీలించిన ఏవో

పీసీపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్టర్‌లో రైతుల సమాచారాన్ని నమోదు చేయాలని వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు అన్నారు. మండలంలోని చినవరిమడుగులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన కందిపైరును ఆయన పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుసేవా కేంద్రంలో ఉన్న రిజిస్టరులో రైతులు తమ వివరాలను వీఏఏల ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న రైతులకు గుర్తింపు నెంబరు వస్తుందన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే రాయితీలు అందిపుచ్చుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారయణ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుల్లో 325 అర్జీలు వచ్చినట్టు చెప్పారు. నిర్ణీత గడువులోగా వీటిని పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీకోసంలో వచ్చిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న వారి జాబితాను గుర్తించాలన్నారు. సమావేశంలో డీటీ ఆర్. శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, మండల సర్వేయర్ కోటంరాజు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి


ముండ్లమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ రైతులకు సూచించారు. మంగళవారం పోలవరం, ముండ్లమూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పోలవరంలో మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ ప్రదీప్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవంపై పోటీలు

కనిగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రాముఖ్యతపై పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి పోటీలో ప్రతిభ కనపరచినవారికి మంగళవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రవికిషోర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 62 విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనపరచినవారు బుధవారం జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎంఈవో నారాయణరెడ్డి చేతల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌పురం ఎంఈవో రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







"మంత్రి లేఖ బట్టబయలు



- మిర్చి యార్డు కార్యదర్శి తీరు వివాదాస్పదం
- రహస్యంగా ఉంచాల్సిన లేఖతో హైకోర్టులో పిటిషన్
- ఆంజనేయులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు సీరియస్
- విచారణకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత ఆదేశాలు

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓ అంశానికి సంబంధించి మంత్రి.. అధికారులకు రాయగా దానిని రహస్యంగా ఉంచాల్సిన అధికారులే బహిర్గతం చేశారు. ఈ విషయం ప్రస్తుతం గుంటూరు మిర్చియార్డు వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వివాదంలో గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు చిక్కుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో అత్యంత గోప్యత కలిగిన ఫైల్‌లోని లేఖను సంపాదించడం, దాన్ని బహిర్గతం చేయడంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయనపై సీరియస్‌గా ఉన్నారు.

ఆ లేఖ ఎలా వచ్చింది...

వ్యవసాయ శాఖా మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిం దన్న దానిపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. పేషీలో ఉన్న ఫైల్ లోని లేఖ బయటకు రావడం పై అధికారులు ఖంగుతున్నారు. ఎవరు ఎవరికి ఈ లేఖను ఇచ్చారన్న దానిపై విచారణ జరిపించి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. సదరు లేఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి కార్యాలయం నుంచే బయటకు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి-1964 ప్రకారం ప్రతి ఉద్యోగి అధికారిక విషయాలను బహిర్గతం చేయకూడదు. మంత్రులు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శి అనుమతి లేకుండా వారికి సంబంధించిన విషయాలను, ఉత్త ర్వుల ను, లేఖలను వెల్లడిచేయడం తీవ్రంగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి వ్యవహారంలో ఏ పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

దీనిపై రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత కూడా మంగళవారం స్పందించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి పంపిన లేఖ ఏ విధంగా బయటకు వచ్చిందనే దానిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కొద్దిరోజులుగా గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారంలో తీవ్ర సందిగ్ధం నెలకొంది. రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరిగా ఉన్న ఆంజనేయులు 2023 డిసెంబరులో అంతకంటే తక్కువ స్థాయి కలిగిన నరసరావుపేట యార్డుకు డిప్యూటేషన్ వేయించుకున్నారు. అక్కడ పనిచేస్తూనే 2024 అక్టోబరు 27న గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. అయితే పూర్తి స్థాయిలో ఖాళీగా ఉన్న అదే పోస్టు కోసం తాజాగా గ్రూపు-1 అధికారి చంద్రిక ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. చంద్రికను గుంటూరు యార్డు కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రామారావు వ్యవసాయ శాఖ మంత్రికి సిఫార్సు చేశారు. ఆ సిఫార్సులను ఆధారం చేసుకుని విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబరు 2న వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరికి మంత్రి ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే తాను ఇన్‌చార్జిగా ఉన్న పోస్టులోకి చంద్రిక వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న సంగతి తెలుసుకున్న ఆంజనేయులు పావులు కదపడం ప్రారంభించారు.

హైకోర్టులో రిట్ పిటిషన్..

గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు అనూహ్యంగా ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖను పొందుపరిచారు. మంత్రి, కీలక అధికారి మధ్య గోప్యంగా ఉన్న లేఖను ప్రభుత్వ ఉద్యోగి బయటకు తీసుకురావడం వివాదాస్పదమైంది. మొదట్లో కేసు ఫైల్ చేసిన సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే అందులో రహస్యంగా ఉంచాల్సిన లేఖ జత పర్చినట్లు తేలడంతో సీరియస్ అవుతున్నారు. ఆంజనేయులు కోర్టులో ఫైల్ చేసిన రిట్ ప్రతిని తెప్పించుకుని అందులో పొందుపరిచిన లేఖను పరిశీలిస్తున్నారు.

నాడు ఆపసోపాలు.. నేడు అభ్యర్థనలు

వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ ఒక ప్రహసనంగా జరిగింది. అరకొరగానే లక్ష్యం నిర్దేశించగా దానిని పూర్తి చేసేందుకు రైతు లు ఆపసోపాలు పడేవారు. నగదు ఎప్పటికి వస్తుందో తెలియక.. రైతులు బహిరంగ మార్కెట్లో నష్టానికి విక్రయించుకున్నారు. అదే ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించి ధాన్యం సేకరణ లక్ష్యం రోజుల వ్యవధిలోనే ముగిసింది. నగదు వెంటనే జమవుతుండటం.. నిబంధనల సడలింపులతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులపై సానుకూల స్పందన రావాల్సి ఉంది.

- నిర్దేశించిన లక్ష్యం మేర ఇప్పటికే సేకరణ పూర్తి
- అదనంగా సేకరణకు ప్రతిపాదనల ఆమోదంలో జాప్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అవస్థలు
- అయినకాడికి దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- మిల్లుల్లో నిల్వ చేసుకున్న ధాన్యం విషయంలోనూ తకరారు

అనుమతిస్తే.. అమ్ముకుంటాం

పొలాల్లో ఇంకా లక్షల టన్నుల ధాన్యం

లక్ష్యం మేరకు ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఇప్పటికే ధాన్యం సేకరణ లక్ష్యం ముగిసి ఐదు రోజులు అవు తుంది. అయినా ఇంకా లక్షల టన్నుల ధాన్యం పొలాల్లో ఉంది. ఇప్పటికే కోత లు కోసిన ధాన్యం మరికొంత రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో సేకరణకు మరి కొంత అను మతిస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో అదనపు అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతిలపై జాప్యం జరుగుతుండటంతో రైతులు ధాన్యాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయించుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధర ను ఇష్టం వచ్చినట్లుగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్ట పోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో నష్టానికి ధాన్యాన్ని విక్రయించి అప్పుల నుంచి బయట పడుతున్నారు. ప్రభుత్వం ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేస్తుండడం.. తేమ శాతంలో కొంత సడలింపు.. తదితరాలతో కొనుగోలు కేంద్రాలకు ఈ సారి భారీగా ధాన్యం రావడం.. అతికొద్ది రోజుల్లో నిర్దేశించిన మేర లక్ష్యం పూర్తి అయింది. ఇంకా దాదాపు నాలుగో వంతు దిగుబడి రావాల్సి ఉంది. ఈ పరిస్థితు ల్లో సత్వరం ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో 50,000 టన్నులు.. గుంటూరు జిల్లాలో 27 వేల టన్నులు.. పల్నాడు జిల్లాలో 5 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఆయా జిల్లాలో ఆ మేరకు ధాన్యం సేకరణ పూర్తి చేశారు. అయినా ఇంకా కల్లాల్లో, పొలాల్లోనే పనల రూపంలో, ఇప్పటికే కోతలు పూర్తి చేసి రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం లక్షల టన్ను ల్లో ఉంది. అయితే నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయిందని ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించడంలేదు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధర విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో దళారులకు అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో బాపట్ల జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం పూర్తయి ఇప్పటికే 5 రోజులు గడిచింది. మరో 25,000 టన్నుల ధాన్యాన్ని కొనేలా అనుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి రెండు వారాల క్రితమే పంపారు. గుంటూరు జిల్లాలో తొలుత పదివేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించగా తర్వాత రెండు విడతలుగా మరో 17,000 టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మరో 8,000 టన్నులకైనా అనుమతి ఇవ్వాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. పల్నాడు జిల్లాలో అదనంగా మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు కోరారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ధాన్యం అదనపు సేకరణకు ఆమోదించినా.. ఎంత పరిమాణం, ఎప్పుడన్న దానిపై స్పష్టత కొరవడింది. మరోవైపు ఇదే అదనుగా దళారులు రంగ ప్రవేశం చేసి బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను మరింతగా పతనం చేసి లబ్ధి పొందే దిశగా సిండికేట్ అవుతున్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులకు లక్ష్యం పూర్తి కావడంతో అక్కడ నిరాశే ఎదురవుతోంది. పంట రైతుల చేతికొచ్చేసరికి మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో మరి కొంత ధాన్యం నిల్వ ఉంది.

గడచిన రెండేళ్లను బేరీజు వేసుకుని..

ధాన్యం సేకరణ విషయంలో లక్ష్యాలను నిర్దేశించేటప్పుడు గడచిన రెండేళ్ల ఆధారంగా నిర్దేశించారని సమాచారం. అయితే గడచిన రెండేళ్లలో ఏ ఒక్క ఏడాది కూడా లక్ష్యాలకు మించి ధాన్యం సేకరణ ఏ జిల్లాలోనూ జరగలేదు. నిబంధనల విషయంలో

(మిగతా 6వ పేజీలో)



బాపట్ల ప్రాంతంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న అన్నదాతలు (పాత చిత్రం)

స్ఫూర్తి ప్రాజెక్టులో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్

నిజాంపట్నంలో ఎండుచేపల ఫ్యాక్టరీ

బాపట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం హార్బర్ అభివృద్ధిలో భాగంగా ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్ఫూర్తి ప్రాజెక్టు ద్వారా ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 90శాతం రాయితీపై 5 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సౌర విద్యుత్ ద్వారా రూపొందించిన ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే ఎండు చేపలు ఎలాంటి రసాయనాలు, ఉప్పు లేకుండా పూర్తి స్థాయిలో ఆరోగ్యకరమైనవిగా ఉంటాయన్నారు. ఇక్కడ ఉత్పిత్తి చేసే చేపలు స్థానిక వినియోగానికి, విదేశాలకు ఎగుమతికి ఉపయోగపడుతాయని చెప్పారు. మారిటైమ్ బోర్డు పరిధిలోనే హార్బర్‌కు అనుసంధానంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఫ్యాక్టరీతో పొదుపు సంఘాల్లోని 500 మంది మహిళలు జీవనోపాధి పొందుతారన్నారు. రెండుఎకరాల భూమి కేటాయించాలని అటవీశాఖాధికారులను ఆదేశించారు. నిజాంపట్నం హార్బర్ రెండో దశలో జరుగుతున్న పనులకు మరికొంత భూమి కేటాయించాలని ఇప్పటికే మారిటైమ్ బోర్డు ప్రతిపాదించిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పద్మ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్, జిల్లా అటవీశాఖాధికారి భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు.. 12 మద్యం దుకాణాలు

ఎన్నికల హామీ మేరకు పది శాతం కేటాయింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గీత కార్మికులకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ప్రక్రియ ప్రారంభించింది. మద్యం దుకాణాల లైసెన్సుల్లో పది శాతం గీత కార్మికులకు కేటాయించడంతో పాటు ఉపకులాల వారీగా ఇచ్చే షాపుల సంఖ్యను పేర్కొంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కులాల జనాభా సంఖ్యకు 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేని ప్రామాణికంగా తీసుకున్నారు. గీత కులాలను మూడు కేటగిరీలుగా విభజించి షాపుల కేటాయింపు చేపట్టారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను త్వరలోనే ఎక్సైజ్ శాఖ విడుదల చేయనుంది. జిల్లాలో 12 మద్యం దుకాణాలను గీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో గౌడ్‌కు 4 కాగా, గౌడకు 8 ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయించడంతో పాటు కుల ధ్రువీకరణ పత్రం కూడా ప్రభుత్వం తప్పని సరిచేసింది. ఫిబ్రవరి మొదటి వారంలోగా లైసెన్సుల కేటాయింపు జరిపేలా ప్రభుత్వం చూడనుంది. లొకేషన్ల ఎంపికకు సంబంధించి విధివిధానాలను నేడో రేపో ఎక్సైజ్ శాఖ ఖరారు చేయనుంది.

పతకాలు సాధించి పేరు తేవాలి

ఖోఖో క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు కోరారు. పంగులూరు ఎస్ఆర్ఆర్ అకాడమీలో జరుగుతున్న రాష్ట్ర ఖోఖో జట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం చైర్మన్ రవినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టు సత్తాచాటాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందన్నారు. ఖేలో ఇండియా ద్వారా పంగులూరులో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని డీఎస్‌డీవో పాల్‌కుమార్‌ను ఆదేశించారు. మంత్రి నారా లోకేశ్ ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలపై దృష్టి సారించారని ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ గరటయ్య తెలిపారు. మూడున్నర దశాబ్దాల ఖోఖో క్రీడా ప్రస్థానాన్ని గరటయ్య గుర్తుచేశారు. ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలలో స్త్రీ, పురుష భారత జట్లు విజేతలుగా నిలిచిన సందర్భంగా చైర్మన్ రవినాయుడు కేక్ కట్‌చేశారు. పురుషుల జట్టులో పాల్గొని రాష్ట్రానికి పేరుతెచ్చిన శివారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, డీఎస్‌డీవో పాల్ కుమార్, స్కూల్‌గేమ్ కార్యదర్శి శీనయ్య, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు కాశీవిశ్వనాథరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు సుబ్బారావు, రామసుబ్బారావు, వీరరాఘవయ్య, అల్లంనేని స్వామి, గరిమిడి జగన్మోహన్, జేకేసీ ఆదిరెడ్డి, చౌదరిబాబు, అవినాష్, మేడ సుబ్బారావు, కోచ్‌లు పాల్గొన్నారు.



ఏపీ ఖోఖో జట్టుతో శాప్ చైర్మన్ రవినాయుడు, అసోషియేషన్ చైర్మన్ గరటయ్య

రాష్ట్ర ఖోఖో క్రీడాజట్టు ప్రకటన

జాతీయ స్థాయి ఖోఖో పోటీలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టులో పి.శివారెడ్డి, కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, కె.వంశీ, ఆర్.సూరినాయుడు, షేక్ ఆలీనవాజ్(ప్రకాశం), పి.నరసయ్య, వి.భానుప్రసాద్(విజయనగరం), బి.కిరణ్(విశాఖ), కె.కొండలరావు(కృష్ణ), వి.పురుషోత్తం(అనంతపురం), ఎ.రాజ్‌కుమార్(చిత్తూరు, కె.ప్రవీణ్(శ్రీకాకుళం), బి.లక్ష్మీనారాయణ(నెల్లూరు), జి.వెంకటేష్(విజయనగరం)ఉన్నారు. జట్టుకు కోచ్‌గా దేవిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి (ప్రకాశం), అసిస్టెంట్ కోచ్‌గా కొమరం అప్పారావు(విజయనగరం), మేనేజర్‌గా కాశీవిశ్వనాధరెడ్డి(ప్రకాశం) వ్యవహరిస్తారు.

అనుమతిస్తే.. అమ్ముకుంటాం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వం అన్నదాతలకు చుక్కలు చూపించడం ఒక ఎత్తయితే నగదు జమ విషయంలో నెలల తరబడి ఎదురుచూడలేక దళారులనే ఎక్కువగా ఆశ్రయించారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర కూడా కొంతమేర ఆశాజనకంగా ఉండడం ఇవన్నీ కూడా గత రెండేళ్లలో సేకరణ అంతంతమాత్రంగా జరిగింది. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. ఈ మేరకు చర్యలు చేపడుతుండడంతో సహజంగానే కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం పరిమాణం పెరిగింది. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, తేమశాతంతో పాటు ఇతర నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలనే ప్రభుత్వ సూచనలు అమలు జరగడం వంటివన్నీ కూడా ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల బాట పట్టడానికి కారణమైంది.

అంచనా వేయడంలో విఫలం..

ధాన్యం సేకరణ లక్ష్యం విషయంలో ప్రభుత్వం సరైన అంచనా వేయలేకపోయింది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలోనే దాదాపు 5 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటోంది. ఈ జిల్లాలో అతి స్వల్పంగా లక్ష్యం 50,000 కే పరిమితం చేసింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ నెలకొంది. బాపట్ల జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 50,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగా, దాదాపు రెండు లక్షల టన్నుల వరకు ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇంకో లక్షన్నర టన్నుల వరకు గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో అన్నదాతలు నిల్వ చేసుకున్నారు. చాలా వరకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పెట్టుబడి కోసం స్థానికంగా ఉండే వ్యాపారులను ఆశ్రయించడంతో, ఇప్పుడు ధాన్యాన్ని కూడా వారికే అమ్ముకుని నిలువునా మోసానికి గురవుతున్నారు.

ధర మరింత పతనమయ్యే అవకాశం..

ఇన్ని రోజులూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తూ ఉండడంతో బహిరంగ మార్కెట్‌లో ధర రూ.1550కి అటూఇటూ ఉంటూ వస్తోంది. కానీ ఇప్పుడు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు నిలిచిపోయాయి. ఇదే అదనుగా ధరను మరింత పతనమైంది. దళారులంతా సిండికేట్ అయి అన్నదాతలను వంచించే కుట్రకు తెరలేపారు. ఇప్పటికే క్వింటా ధాన్యం ధర రూ.1400కు తగ్గించి దళారులు అడుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం వెంటనే అదనంగా ధాన్యం సేకరణకు అనుమతులిస్తే అటు రైతులకు మేలు జరగడంతో పాటు బయట మార్కెట్‌లో ధాన్యం ధర మరింత పతనమవకుండా కాపాడినట్లవుతోంది. ఈ పరిస్థితుల్లో వెంటనే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో వైపు గతంలో వర్షాల సమయంలో ఉన్న ధాన్యాన్ని ముందుగా మిల్లులకు తరలించాలని ప్రభుత్వం సూచించింది. చాలా మంది రైతులు తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని మిల్లులకు తరలించి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం లక్ష్యం పూర్తి కావడంతో ఆ ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. కొనని కాడికి ఎందుకు నిల్వ చేసుకోనిచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 10,000 టన్నుల ధాన్యం మిల్లుల్లో ఈ ధాన్యం నిల్వ చేసి ఉన్నారు. ఈ ధాన్యం విషయంలో ప్రస్తుతం తకరారు నడుస్తోంది.

ఏఎంసీల రిజర్వేషన్లు కొలిక్కి..

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పాలక మండళ్ల రిజర్వేషన్ల వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఈ విషయంలో అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల అభ్యంతరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్‌గా స్పందించడంతో అడుగు ముందుకు పడింది. ఆయా జిల్లాల వారీ ఉన్న ఏఎంసీ చైర్మన్ల పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు.. అందులోనూ మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల ఇన్‌చార్జిలతో మాట్లాడి రిజర్వేషన్లు ఖరారు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఆ మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం.

వారితో మంత్రులు
ఆనం, డోలా చర్చలు
అటు మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి జోక్యం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఏఎంసీల రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కివచ్చింది. అందుకు సంబంధించిన కసరత్తు పూర్తయ్యింది. వాటిని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తొలుత అత్యధిక జిల్లాల కలెక్టర్ల ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఎక్కువ మంది తమ పరిధిలోని ఏఎంసీ చైర్మన్ పదవులను జనరల్ కేటగిరీలో ఉంచాలని పట్టుబట్టారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు టీడీపీ అధిష్ఠానం అప్పగించింది. తదనుగుణంగా జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రంగంలోకి దిగారు. అయినప్పటికీ కొత్త జిల్లాతోపాటు ఉమ్మడి ప్రకాశంలో కూడా రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. అనేక మంది ఎమ్మెల్యేలు తమ ఏఎంసీని జనరల్ కేటగిరీలో ఉంచాలని పట్టుబట్టడంతో తిరిగి సమస్య ముఖ్యమంత్రి వద్దకు వెళ్లింది. అలా సీఎం దృష్టికి వెళ్లిన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం కూడా ఉంది.

జనాభా ప్రాతిపదికనే..

మొత్తం పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటు ఇన్‌చార్జి మంత్రులు, అటు కలెక్టర్లకు రిజర్వేషన్ల విధానాలను తూచా తప్పకుండా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇన్‌చార్జి మంత్రులతో ఆయన ప్రత్యేకంగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పల్నాడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి రవికుమార్ ఎమ్మెల్యేలను తన ఇంటికి పిలిపించుకొని అందర్నీ సమావేశపర్చి ఏకాభిప్రాయంతో పదవుల రిజర్వేషన్లు పూర్తిచేశారు.


ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మీరే అర్థం చేసుకోక పోతే ఎలా..?

దర్శి, కనిగిరి ఏఎంసీలను ఎస్సీలకు రిజర్వు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి నియోజకవర్గ పరిస్థితిని వివరించగా మీరు కూడా పరిస్థితి అర్థం చేసుకోకపోతే ఎలా అని మంత్రులు ఆనం, అదే పద్ధతిలో మీరూ చేయాలి' అని ఆదేశించారు. అప్పటికీ వినకపోతే తానే జోక్యం చేసుకొని ఆయా ఏఎంసీల పరిధిలో ఉన్న జనాభా ప్రాతిపదికన ఖరారు చేస్తానని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇటు ప్రకాశం ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి స్వామి.. అటు బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి రవికుమార్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇన్‌చార్జి మంత్రులు గత ఐదు రోజుల నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో సీఎం ఆదేశాలు చెప్పి అనేక ఏఎంసీల రిజర్వేషన్లపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. స్వామిలు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. కందుకూరు పదవిని బీసీలకే రిజర్వు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించినట్లు ప్రచారంలో ఉంది. అందుకు అనుగుణంగా ఆర్థికంగా బలవంతుడైన ఒక బీసీ నాయకుడికి చైర్మన్ పదవిపై హామీ కూడా ఇచ్చినట్లు నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. అద్దంకి నియోజకవర్గంలో రెండు ఏఎంసీలు ఉండగా మంత్రి రవికుమార్ సూచనలు పరిగణనలోకి తీసుకొని అద్దంకిని ఎస్సీకి, సంతమాగులూరు (మార్టూరు) ఏఎంసీని జనరల్ కేటగిరీకి రిజర్వు చేసినట్లు సమాచారం. పర్చూరు ఏఎంసీని జనరల్ కేటగిరీలో ఉంచాలని భావిస్తున్నప్పటికీ జిల్లా మొత్తంపై రిజర్వేషన్ల వ్యవహారం కొలిక్కి వచ్చిన తర్వాత ఖరారు కావచ్చని తెలిసింది. దాన్ని జనరల్ మహిళకు కేటాయిస్తున్నట్లు సమాచారం. చీరాల నియోజకవర్గం విషయంలో ఎమ్మెల్యే కొండయ్య బీసీ అయినందున వేరే వర్గంకు రిజర్వు చేయాలని కలెక్టర్ ప్రతిపాదించినట్లు తెలిసింది. చివరకు బీసీ మహిళకు కేటాయించనున్నట్లు సమాచారం. రానున్న మూడు, నాలుగురోజుల్లో ఈ రిజర్వేషన్లపై అధికారికంగా తుది నిర్ణయం తీసుకొని ప్రకటించే అవకాశం ఉంది.

ఎస్సీ ఎమ్మెల్యే ఉంటే ఓసీలకు..

ఒంగోలు ఏఎంసీ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రిజర్వు అయినందున తిరిగి వారికే ఇస్తే తనకు అభ్యంతరం లేదని ఎమ్మెల్యే దామచర్ల తెలిపినట్లు తెలిసింది. దీంతో ఆ విధంగానే రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే పదవులు దళితులకు రిజర్వు అయి నందున తమ నియోజకవర్గాల్లోని ఏఎంసీలను జనరల్ కేటగిరీలో ఉంచాలని మంత్రి స్వామి, ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు కోరారు. తాజా సమాచారం మేరకు కొండపి జనరల్ కేటగిరీలో ఉంచినప్పటికీ అవసరమైతే మహిళ కు రిజర్వు చేయాలని భావిస్తున్నారు. ఎస్‌ఎన్ పాడులోని మద్దిపాడు ఏఎంసీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిసింది. వైపాలెం ఏఎంసీ పదవిని మాత్రం ఎస్టీలకు రిజర్వు చేసినట్లు సమాచారం. మార్కాపురం నియోజకవర్గం లో మార్కాపురం జనరల్ కేటగిరీలో ఉంచి, పొదిలి ఎస్సీలకు రిజర్వు చేయాలని భావించా రు. కుదరని పక్షంలో పొదిలి బీసీకి రిజర్వు చేయొచ్చు. గిద్దలూరు నియోజకవర్గంలో గిద్దలూరు ఏఎంసీ జనరల్ కేటగిరీలో ఉంచి, కంభం ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీలకు రిజర్వు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

క్రీడాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యం

అభివృద్ధిలో ఏలూరి కృషి అభినందనీయం
శాప్ చైర్మన్ రవినాయుడు

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ చైర్మన్ రవినాయుడు చెప్పారు. మంగళవారం మార్టూరు మండలం ఇసుకదర్శిలో ఉన్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఏలూరి ఫిట్‌నెస్ సెంటర్‌ను, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఏలూరి సాంబశివరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దీంతోపాటు క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఆయన చూపుతున్న చొరవ మరువలేనిదన్నారు.


ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

ఏలూరి యూత్ ఫిట్‌నెస్ పోస్టర్ ఆవిష్కరణ

ఎమ్మెల్యే ఏలూరి పుట్టినరోజు సందర్భంగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌తో ప్రారంభించనున్న ఏలూరి యూత్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను రవినాయుడు ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే సిఫార్సు లేఖలకు స్పందన

పర్చూరులో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి, కారంచేడు రామానాయుడు స్టేడియం కాంపౌండ్‌వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు క్యాంప్ కార్యాలయ సిబ్బంది వినతిపత్రాన్ని చైర్మన్‌కు అందజేశారు. తక్షణమే స్పందించిన రవినాయుడు నిధులు మంజూరు చేసి క్రీడాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. ఇప్పటికే పర్చూరు ఎన్టీఆర్ క్రీడా వికాస అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు.


అద్దంకి పరిసర ప్రాంతంలో పొగమంచులో కొద్దిగా కనిపిస్తున్న సూర్యుడు


అద్దంకి పట్టణంలో దట్టంగా ఉన్న పొగమంచు

దట్టంగా పొగమంచు

వాహనచోదకులకు అవస్థలు

అద్దంకి/బల్లికురవ/మేదరమెట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పొగమంచు మరింత పెరిగింది. 15 రోజులుగా పొగమంచు పడుతున్నప్పటికీ మంగళవారం మరింత ఎక్కువగా కురిసింది. ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు వదలకపోవడంతో వాహనచోదకులు మరింత ఇబ్బంది పడ్డారు. వేకువజామున ప్రయాణించే వాహనచోదకులకు అద్దంకి పరిధిలోని నామ్ రోడ్డుపై వాహనాలు కనిపించక ఇబ్బంది పడ్డారు. వాహనచోదకులు నిదానంగా వెళ్లడంతో పాటు లైట్లు వేసుకొని ప్రయాణించారు. పొగమంచు మరింత దట్టంగా ఉండడంలో వర్షపు చిరుజల్లుల వలే పడ్డాయి. దూరప్రయాణం చేసే వాహనచోదకులు మంచు వదిలే వరకు ఆగిపోయారు. బల్లికురవ, సంతమాగులూరు, బల్లికురవ-మార్టూరు, బల్లికురవ-కొమ్మాలపాడు రోడ్లలో మంచు ప్రభావం అధికంగా కనిపించింది. మేదరమెట్లలోనూ మంచుప్రభావం విపరీతంగా ఉంది. రోడ్లన్నీ మంచుతో కనిపించలేదు.


బల్లికురవ మండలం గుంటుపల్లిలో మంచులోనే పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు

గీత కార్మికులకు పండుగే

అవీఇవీ

సగం ధరకే మద్యం దుకాణాలు
జిల్లాకు 18 షాపులు మంజూరు
ఇప్పటికే సీఎం హామీ మేరకు ఒకటి కేటాయింపు

ఒంగోలు క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలలో గీత కార్మికులు పది శాతం కేటాయిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు 17 దుకాణాలు కేటాయించారు. అదేక్రమంలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గీత కార్మికుడికి ఒక దుకాణాన్ని కేటాయిస్తున్నట్లు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో మొతం 18 దుకాణాలు గీత కార్మికులకు కేటాయించినట్లైంది. అయితే 17 దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించేందుకు కసరత్తు మొదలైంది. అందుకు సంబంధించిన విధివిధానాలు రూపొందించారు. గీత కార్మికులకు కేటాయించే దుకాణాలకు సంబంధించి లైసెన్స్ ఫీజు మాత్రం ఇప్పుడు ఉన్న దానిలో సగానికే ఇస్తున్నారు. దరఖాస్తు ఫీజు మాత్రం పాత పద్ధతిలోనే రూ.2లక్షలుగా నిర్ణయించారు. అయితే ఒకరు ఒక మద్యం దుకాణానికి మాత్రమే దరఖాస్తు చేయాలనే నిబంధన పెట్టారు. ఈ నేపథ్యంలో కులాల వారీగా ప్రభుత్వం కేటాయింపులు చేశారు. గీత కార్మికులను 2018లో స్మార్టు సర్వే చేపట్టి వారి జనాభా లెక్కలు తీశారు. ఈ ప్రకారం ప్రకాశం జిల్లాకు గౌడ 7, ఈడిగ 1, గౌడా 7, గవండ్ల 1, గౌండ్ల 1 లెక్కన మద్యం దుకాణాలు కేటాయించారు. అయితే అందుకు సంబంధించి ఈ దుకాణాలు ఎక్కడ కేటాయించాలి అనే అంశంపై అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన గీత కార్మికులకు కేటాయించిన దుకాణాలు ఏ మండలంలో కేటాయించాలనే దానిని పరిశీలిస్తోంది. మండలాల వారీగా కేటాయింపులు చేసిన తర్వాత దరఖాస్తులను ఆహ్వానించి లాటరీ పద్ధతిలో ప్రక్రియను పూర్తిచేస్తారు. అయితే గీతకార్మికులకు లైసెన్స్ ఫీజులో రాయితీ ఇవ్వడంపై ప్రస్తుతం మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు గుర్రుగా ఉన్నారు. సగం ధరకు మద్యం దుకాణం తీసుకున్న వారితో పోటీపడి మద్యం విక్రయాలు చేయడం కష్టంగా ఉంటుందని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలపై ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం అయితే గీత కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం మద్యం దుకాణాలు కేటాయించడంతో పాటుగా లైసెన్స్ ఫీజులో రాయితీ ఇస్తు విధివిధానాలు తయారు చేసింది.

సిలిండర్లకు అదనంగా వసూలు చేస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. సిలిండర్లకు వినియోగదారుడు చెల్లించిన నగదును మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు. అయితే లబ్ధిదారులు దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జేసీ తెలిపారు. అటువంటివి నిజమని రుజువైతే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవంతోపాటు బ్లాక్‌లిస్టులో పెట్టి లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఉచిత గ్యాస్ పొందే ఏ వినియోగదారుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తుంటే వెంటనే 0891- 2590100, 0891-2590102 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని జేసీ కోరారు.

ఉచితం పేరుతో మాయ

మినీ స్విమ్మింగ్‌పూల్, చిన్నపిల్లల ఆటస్థలం ఏర్పాటు
అక్కడే ఐస్‌క్రీం స్టాల్ ఏర్పాటుచేసి జోరుగా వ్యాపారం
ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు.. చోద్యం చూస్తున్న అధికారులు


ఆర్‌అండ్‌బీ మార్జిన్ స్థలంలో నిర్మించిన మినీ స్విమ్మింగ్‌పూల్

దర్శి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేసి ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దర్శి-కురిచేడు రోడ్డులో ఒక డెయిరీ యజమాని ప్రభుత్వ స్థలంలో మినీ స్విమ్మింగ్ పూల్, పిల్లల పార్క్ ఏర్పాటుచేసి తద్వారా ఐస్‌క్రీమ్ స్టాల్ ఏర్పాటు చేసి జోరుగా వ్యాపారం చేయిస్తూ లబ్ధి పొందుతున్నాడు. పిల్లలకు ఉచితంగా స్విమ్మింగ్ పూల్‌లో ఎంజాయ్ చేసే అవకాశం ఇస్తున్నామని, ఆడుకునేందుకు వస్తువులు ఏర్పాటు చేశారు. వచ్చిన చిన్నారులతో తెలివిగా తినుబండారాలు విక్రయించి ముమ్మరంగా వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే అమాయకులు ఉచిత సేవ చేస్తున్నాడని భ్రమపడుతున్నారు. ఉచితం మాటున ప్రతిరోజు వేలాది రూపాయల వ్యాపారం చేస్తున్నాడు. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. ఒకవైపు ఆర్‌అండ్‌బీ స్థలం, మరో వైపు ఎన్నెస్పీ స్థలంలో ఈ నిర్మాణాలు చేపట్టారు. ఏళ్ల తరబడి మినీ స్విమ్మింగ్ పూల్ నడుపుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

దర్శిలో అనేకచోట్ల ఆక్రమణలు

దర్శి పట్టణంలో అనేకచోట్ల ఇదే తంతు జరుగుతుంది. ఎంతో విలువైన రోడ్డు మార్జిన్ స్థలాలను ఆక్రమించి సొంత స్థలంలో కలుపుకుంటున్నారు. ఆతర్వాత బిల్డింగ్ కట్టుకొని ప్రభుత్వ స్థలంతో కలిపి ప్రహరీగోడలు నిర్మించుకుంటున్నారు. మరికొంతకాలానికి అక్కడ కూడా నిర్మాణాలు చేపట్టి స్వాహా చేస్తున్నారు. దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-పొదిలి రోడ్డులో కూడా పలు చోట్ల రోడ్డు మార్జిన్ స్థలాలను ఆక్రమించారు. సంబంధిత అధికారులు మాత్రం ఆక్రమణల గురించి పట్టించుకోవటం లేదు. ఆయా శాఖలకు చెందిన కోట్లాది రూపాయల విలువచేసే స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమేరకు చలనం వచ్చింది. అక్కడక్కడా ఆక్రమణలపై చర్యలు తీసుకోవటం ఆరంభించారు. అన్నిశాఖల అధికారులు పూర్తిస్థాయిలో స్పందించి విలువైన ప్రభుత్వ స్థలాలను అక్రమణల నుంచి తొలగించి రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.500 నోటుతో జర జాగ్రత్త

ఓ వైన్ దుకాణంలో వెలుగుచూసిన రూ.500 నోట్లు రెండు
నగదు లావాదేవీల్లో అప్రమత్తత అవసరం

చీరాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : రూ.500 నోట్లు తీసుకునేటప్పుడు జర జాగ్రత్త.. నకిలీ నోట్లు చెలామణి చేయడం చట్టరీత్యా నేరం.. అంతవరకు బాగానే ఉన్నా... కొన్ని సందర్భాల్లో మనకు తెలియకుండానే లావాదేవీల్లో నకిలీనోట్లు చేరుతున్న సందర్భాలు ఉన్నాయి. బ్యాంకుల్లో అయితే నోటును చించడమో, కాల్చడమో చేస్తారు. అంతవరకు మంచిదే. మనకు తెలియకుండా మన చెంతకు నకిలీ నోటు చేరితే ఆ విషయం తెలియక చేసే లావాదేవీల్లో దానిని నకిలీదిగా గుర్తిస్తే నోటు ఇచ్చిన వ్యక్తి జవాబుదారీ అవుతారు. అసలు ఆ నోటు ఎవరు ఇచ్చారో గుర్తులేకుంటే చివరగా ఆ నోటు ఎవరి దగ్గర గుర్తిస్తే వారు బాధితులు, బాధ్యులు అవుతారు.

ఇటీవల చీరాలలో వెలుగుచూసిన రెండు సంఘటనలు

ఇటీవల చీరాలలోని ఓ వైన్ దుకాణంలో కేవలం నెల రోజుల వ్యవధిలో రెండు రూ.500 నోట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళ్లినప్పుడు ఆ విషయం వెలుగు చూసినట్లు ఆ వైన్ దుకాణ నిర్వాహకుడు తెలిపారు. మద్యం దుకాణంలో రద్దీగా ఉండే సమయంలో ఏ నోటు ఎవరిచ్చారో కూడా అర్థం కాదని, దానిని ఎవరి నుంచి తీసుకున్నామో కూడా గుర్తుండదని అతను వాపోయాడు.



నకిలీ రూ.500 నోట్లు

17 అంశాలు తెలిస్తే నకిలీవి గుర్తించవచ్చు

రూ.500 నోటుకు సంబంధించి అసలు నోటు అయితే ఈ కింద పేర్కొన్న 17 అంశాలు ఉంటాయి. నకిలీ కూడా దాదాపు అదే విధంగా వచ్చినా కొన్ని లోపాలు ఉంటాయని, అనుమానం వస్తే వెంటనే ఆ అంశాలను సరిపోల్చి చూసుకోవాల్సిన అవసరం ఉందని బ్యాంకు అధికారులు చెప్తున్నారు. ఎవరికైనా నకిలీ నోట్లు వస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

17 అంశాలను సరిపోల్చుకోవాల్సిన అవసరం ఉంది. అలానే డబ్బు లెక్కించే మిషన్ కూడా నకిలీ నోటును వెంటనే గుర్తిస్తుంది. అనుమానం వచ్చినపుడు ఏదో ఒక పద్ధతిలో సరిచూచుకోవాల్సిన అవసరం ఉంది.



అసలు నోటులో ఉండే అంశాలు

1. 500 రూపాయల నోటు సంఖ్యలో కనిపించే పారదర్శకమైన రిజిస్టర్.
2. సంఖ్య గుర్తుకు సంబంధించిన గుప్తమైన చిత్రం.
3. దేవనాగరి లిపిలో సంఖ్య గుర్తు గుర్తింపు.
4. మహాత్మాగాంధీ పోర్ట్రెయిట్ దిశ, సంబంధిత స్థానంలో మార్పు.
5. కంచెడు సెక్యూరిటీ థ్రెడ్ కేవలం నోటును ఒత్తివేసినపుడు ఆకుపచ్చ నుంచి నీలంకు మారుతుంది.
6. గ్యారంటీ క్లాజ్, గవర్నర్ సంతకం, ఆర్బీఐ చిహ్నాం కుడి వైపునకు తిప్పబడినది.
7. నంబర్ ప్యానెల్ పెద్ద నుంచి చిన్నదిగా పెరుగుతున్న సంఖ్య గుర్తులతో పైన, కింద, పక్కన.
8. కుడి పక్కలో రూ.500 సంఖ్య గుర్తులు ఉంటాయి.
9. అశోక చిలుక చిహ్నాం కుడి పక్కలో కనిపిస్తుంది.
10. మహాత్మాగాంధీ పోర్ట్రెయిట్, అశోక చిలుక చిహ్నాం, గుర్తింపు చిహ్నాం ఎత్తు పెరిగిన ముద్ర ఉంటుంది.
11. 500 ఎత్తు పెరిగిన ముద్రలో రౌండ్ చుట్టూ కనిపిస్తుంది.
12. కుడి, ఎడమ 5 పొడవైన ఎత్తు పెరిగిన రేఖలు.
13. ఎడమ వైపున ముద్రించిన సంవత్సరం
14. స్వచ్ఛభారత్ లోగో
15. భాషా ప్యానెల్ కేంద్రం.
16. భారత జాతీయ పతాకంతో రెడ్ పోర్ట్ చిత్రం.
17. నెంబరు, సంఖ్యా గుర్తు దేవనాగరి లిపిలో కుడిపక్కన.



కలెక్టర్ వెంకటమురళితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

కలెక్టర్‌తో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో తాగునీరు, డ్రైన్లు, రోడ్లు తదితర సమస్యల పరిష్కారంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంగళవారం కలెక్టర్ జె.వెంకటమురళిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై వారివురి మధ్య చర్చ జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కొండయ్య కలెక్టర్ వెంకటమురళికి మర్యాద పూర్వకంగా బొకే అందజేశారు.

24న చేనేత సమస్యలపై ఆందోళన

చీరాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ ఏడీ కార్యాలయం వద్ద చేనేత రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24వ తేదీన ఆందోళన చేపట్టనున్నట్లు చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు.



విజయలక్ష్మీపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విజయలక్ష్మీపురంలో గ్రామస్థులకు తాగునీటి సమస్య పరిష్కారానికి, సీసీ రోడ్లు నిర్మాణానికి తగిన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు గ్రామస్థులకు తెలిపారు. మంగళవారం ఆయన, తహసీల్దార్ గోపీకృష్ణతో కలసి విజయలక్ష్మీపురంలో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెత్త సమస్యను తొలగించాలని విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న పేరాల కారెంపూడివారి వీధికి చెందిన మహిళలు

చీరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పేరాల కారంపూడివారి వీధికి చెందిన పలువురు మహిళలు మంగళవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను కలసి వినితిపత్రం అందజేశారు. చెత్త సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ జంజనం వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. పట్టణంలో కూడా ఎక్కడ కూడా పారిశుధ్యానికి సంబంధించి అశ్రద్ధ చేయవద్దని స్పష్టం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ సిబ్బందికి ఆ ప్రాంతానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. మురుగు కాలువలో తీసిన మట్టిని ఒకరోజు ఎండబెట్టాలన్న ఉద్దేశంతో అలా ఉంచారని, బుధవారం తొలగిస్తారని స్థానికులకు చెప్పారు.

గోనె సంచులు తెచ్చుకుంటే డబ్బులిస్తాం



ధాన్యాన్ని తూకం వేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వేటపాలెం(చీరాల), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాగాణి సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని మిల్లులో విక్రయించుకునేందుకు అవసరమైన గోనె సంచులు మిల్లులో ఉచితంగా ఇస్తారని, మీరే తెచ్చుకుంటే వాటి ధరను ప్రభుత్వం చెల్లిస్తుంది ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలో దేశాయిపేటలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జగన్మోహనరావు అనే రైతు చేలో ధాన్యం దిగుబడికి సంబంధించి చదరపు మీటరులో ఎంత ధాన్యం వచ్చింది తూకం వేసి లెక్కించారు. దాని ప్రకారం ఎకరాకు ఎంత దిగుబడి వస్తుందో లెక్కించారు. కార్యక్రమంలో ఏఇఓ జస్వంత్, వీఏఏలు మనీషా, కావ్య, రుఫియా, సరేనా, కుసుమ, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

15 మంది ఉద్యోగాలకు ఎంపిక

అద్దంకిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఆర్ ఎంప్లాయిమెంట్ రాజారావు హాజరై నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించే జాబ్ మేళాలు, శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు అరబిందో ఫార్మా, ఇలలాగిరి సొల్యూషన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాలకు 60 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 15మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సీనియర్ లెక్చరర్ డాక్టర్ రాజకుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత కరువు

- నినాదాలకే పరిమితమైన లక్ష్యం
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- రోడ్డు మార్జిన్‌లే డంపింగ్ యార్డ్‌లు
- తీవ్రమైన కంపుతో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నాగులపాలెంలో ముళ్ల చెట్లతో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



ప్రధాన రహదారి మార్జిన్‌లో కుప్పలుగా ఉన్న వ్యర్థాలు

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ భారత్ నినాదాలు మాటలకే పరిమితమవుతున్నాయి. గ్రామాల్లో స్వచ్ఛత కరవవుతోంది. చెత్త నుంచి సంపదను సృష్టించాలన్న సంకల్పంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన సంపద కేంద్రాలు (డంపింగ్ యార్డ్‌లు) నేడు నిరుపయోగంగా మారాయి. చెత్త సంపద కేంద్రాలను నిర్మించారే తప్ప వాటిని వినియోగంలోకి తెచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం అవి ముళ్లచెట్లు, పొదలతో దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపింగ్ యార్డులు వినియోగంలోకి రాకపోవడంతో కొన్ని చోట్ల అవికాస్త శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో ఆయా పంచాయతీల ద్వారా పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను వాహనాల ద్వారా రోడ్డు మార్జిన్‌లలో పడేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రధాన రోడ్ల మార్జిన్‌లు డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. పైగా ఆ మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్రమైన కంపుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో పెద్ద ఎత్తతన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. చెత్తను తగులబెట్టే క్రమంలో ఒక్కసారిగా దట్టమైన పొగ వ్యాపించడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి ఇంకొల్లు, యద్దనపూడి వెళ్లే ప్రధాన రహదారుల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారింది. లక్షలు వెచ్చింది నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను అలా నిరుపయోగంగా వదిలేశారని, దీంతో చెత్త శుద్ధి లక్ష్యం నీరుగారిపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న మరమ్మతులతో దానిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. పర్చూరులో మాత్రం డంపింగ్ యార్డ్‌ను తాటాకుల షెడ్‌తో సరిపెట్టి మమ అనిపించారే తప్ప పూర్తి స్థాయిలో నిర్మించలేదు. అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు, రమణాయపాలెం తదితర గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను నిర్మించారే తప్ప వినియోగించడం లేదు. ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపిగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడంతోపాటు మెరుగైన పారిశుధ్య కార్యక్రమాల ద్వారా ప్రజల ఆరోగ్యప్రజలకు మెరుగైన పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం అన్న విషయాన్ని అధికారులు గుర్తెరిగి తక్షణ చర్యలు చేపట్టి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

సీఐ సుబ్బరాజు



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, జనవరి21(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని సీఐ సుబ్బరాజు అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గ్యారేజీలో ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌లు, మెకానిక్‌లు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు మీద వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు రోడ్డు మార్జిన్‌లో నిలపాలన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు, అసిస్టెంట్ మేనేజర్ మహబూబి, అశోక్‌లైలాండ్ శిక్షణాధికారి మురళి, ఎంఎఫ్ బాబ్జీ, కార్మికులు పాల్గొన్నారు.

ఏబీసీలో పడిపోయిన నీటి మట్టం

- ఎగువ భాగంలో తగ్గించారంటున్న అధికారులు
- ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలంటున్న రైతులు



ఏబీసీ కాలువకు తక్కువగా వస్తున్న నీరు

బల్లికురవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువలో నీటి మట్టం పడి పోయింది. ఎగువ భాగంలో నీటిని అధికారులు నిలుపుదల చేయించడంతో మంగళవారం ఏబీసీలో నీరు అడుగుకు చేరింది. ఇప్పుడు వచ్చే నీరు మేజర్‌లకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి నీరు రావడం తగ్గిందని అధికారులు మాత్రం పై భాగంలో నీటిని నిలిపి వేశారని, రెండు రోజుల్లో మరలా నీరు వస్తుందని చెప్తున్నారని, ఇప్పుడు నీటి విడుదల నిలిపివేస్తే పంటలు బెట్టకు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 33వ మైలు వల్లాపల్లి లాకుల వద్దకు రెండు అడుగుల మేర కూడా నీరు రావడం లేదని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే సాగర్ నీటిని ఏబీసీకి విడుదల చేయాలని లేకుంటే పంటలు దెబ్బ తింటాయని రైతులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయని రైతులు తెలిపారు.

రావిపూడి హేతువాద ఉద్యమ కృషి చిరస్మరణీయం

ఇంకొల్లు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలం నాగండ్ల గ్రామానికి చెందిన రావిపూడి వెంకటాద్రి హేతువాద, మానవవాద ఉద్యమ కృషి చిరస్మరణీయమని రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేడూరి సత్యనారాయణ అన్నారు. హ్యూమనిస్టు సెంటర్‌లో మంగళవారం ప్రముఖ హేతువాది రావిపూడి ద్వితీయ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో భారతహేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు, ఏపీ హేతువాద సంఘ అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు, ప్రధానకార్యదర్శి షేక్ దరియావలి, శేషయ్య, హేతువాదులు పాల్గొన్నారు. ముందుగా రావిపూడి చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం మేడూరి రచించిన ప్రకృతి నియమబద్ధత గ్రంథాన్ని ప్రఫుల్ల చంద్ర ఆవిష్కరించారు.



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

రామ్మూర్తి కృషి మరువలేనిది

అద్దంకిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం గానాల రామ్మూర్తి చేసిన కృషి మరువలేమని వక్తలు కొనియాడారు. మంగళవారం అద్దంకిలోని వుడ్ కాంప్లెక్స్ ఏరియాలో గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను అద్దంకి పట్టణ వి శ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇప్పటి వరకు రాజకీయంగా విశ్వబ్రాహ్మణులకు ఎటువంటి ప్రాధాన్యత లేదని, ఎంఎల్‌సీ ఇవ్వాలని బ్రహ్మానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవిచంద్ర, రామబ్రహ్మాచారి, ఆంజనేయులు, వీర బ్రహ్మాచారి, చిరంజీవి, గోవిందచారి, హరిబాబు, రమేష్, లలిత పాల్గొన్నారు.

నిపుణుల సలహా మేరకే కలుపు మందు వాడాలి

ఏడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పంట సాగులో కలుపు మందు నిపుణుల సూచనల మేరకే వాడాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కలుపు మందు విచక్షణా రహితంగా వాడితే పంటతో పాటు భూమికి నష్టం వాటిల్లుతుందన్నారు. గ్రామాలలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను స్థానిక అధికారులు, రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, సర్పంచ్ రౌతు సాంబశివరావు, పృధ్వీ సాయి, దిల్జా, శివరామరాజు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్య రక్షణ

చర్యలు చేపట్టాలి

అద్దంకిటౌన్ : మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాలలోల పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు మొక్కజొన్నలో కత్తెర పురుగును గమనించి, దాని నివారణ కోసం ఎమామెక్టిన్ బెంజోఏట్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాకనాటి అంజిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సీత పాల్గొన్నారు.



పర్చూరులో రూపుదిద్దుకుంటున్న శ్రీ అష్టలక్ష్మి ఆలయం

31న అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

- రూ.4కోట్ల దాతల సహకారంతో నిర్మాణం
- హాజరుకానున్న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

పర్చూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారం రూ.4కోట్ల వ్యయంతో పర్చూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈనెల 31న ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి పాబోలు వెంకట సత్యనారాయణ తెలిపారు. కారర్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామితోపాటు, శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామి హాజరు కానున్నారు. పలు అభిషేకాలతోపాటు మహా కుంభాభిషేకం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

మార్టూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 21 మంది సభ్యులకు గాను నలుగురు మాత్రమే హాజరు కావడంతో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

జడ్పీటీసీ సభ్యుని కుటుంబాన్ని పరామర్శించిన నేతలు



సుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న బలరాం, బూచేపల్లి

బల్లికురవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి బల్లికురవ మండల జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాసరావు తండ్రి సుబ్బయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శించి సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన టీడీపీ, వైసీపీ పార్టీలకు చెందిన నేతలు సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి నవాళులర్పించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జార్లమూడివారిపాలెం గ్రామంలోని రామాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్మోహనరావు, నేతలు జాగర్లమూడి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల అవినాష్, బీజేపీ నాయకులు జాగర్లమూడి ఎలమందరావు, పూర్ణ, విజయ్ ఉన్నారు.

పశు పోషణలో వైద్యుల సూచనలు పాటించాలి



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి మురళీకృష్ణ

పంగులూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు పశు పోషణలో వైద్యుల సూచనలు పాటించాలని పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని బూదవాడ, రేణంగివరం గ్రామాలలో మంగళవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందుతాగించారు. గేదెలకు, ఆవులకు సూడి పరీక్షలు నిర్వహించి ఎద ఇంజక్షన్లు చేశారు. రేణంగివరంలో డాక్టర్ సైదయ్య పశువులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం నిర్వహించారు. పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన పూసపాటి శివపార్వతి వైద్యులు ఓ పాజిటివ్ రక్తం ఎక్కించాలని చెప్పగా వారి కుటుంబ సభ్యులు రోటరీ క్లబ్ బ్లాడ్ బ్యాంక్ డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావును ఆశ్రయించారు. దీంతో అద్దంకిలోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వర్లును ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని రక్తదాతను, పోత్సహించిన వారిని అభినందించారు.

రైతులు పొలాన్ని చూపించాలి

మేదరమెట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వే జరుగుతున్నందున అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రైతులు అందుబాటులో ఉండి పొలాన్ని చూపించాలని సర్వేయర్ మహేష్‌బాబు తెలిపారు. మంగళవారం దైవాలరావూరులో నాలుగు బృందాలు రీ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఒక్కో బృందంలో సర్వేయర్, వీఆర్వో ఇతర అధికారులు ఉన్నారు. వీరంతా సర్వే నెంబర్ల వారీగా రోజూ 20 లేదా 25 ఎకరాలను పరిశీలించి, రైతులతో మాట్లాడి పేర్లను నమోదు చేసుకుంటున్నారు. తమవద్ద ఉన్న రికార్డుతో రైతులు చెప్పే సమాచారాన్ని పోల్చి చూస్తున్నారు. రైతులు పూర్తి సమాచారంతో అధికారులు పిలిచినపుడు పొలం వద్దకు వస్తే రీసర్వే తొందరగా పూర్తవుతుందని మహేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రాజు, నరసింహారావు, సర్వేయర్లు ఇమ్మానియేల్, వైష్ణవి, సుబ్బరావు పాల్గొన్నారు.



దైవాలరావూరులో రీ సర్వే చేస్తున్న అధికారులు

రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువలపై

అభ్యంతరాలు తెలియజేయండి : జేసీ

నెల్లూరు (హరనాధపురం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూములు, ఇళ్ల స్థలాల విలువల మార్పులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా మార్కెట్ విలువల రివిజన్ కమిటీ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక మార్కెట్ విలువలను ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దారు, ఎమ్పీడీవో, ఆర్డీవోకార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లోని నోటీసు బోర్డులలో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 24లోపు అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

గీత కులాలకు వైన్‌షాపులు!

- జిల్లాకు 18 దుకాణాల కేటాయింపు
- దక్కించుకునేందుకు వ్యాపారుల కసరత్తు



గీత కులాలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సదరు కులాల వారికి వైన్ షాపులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారం జిల్లాకు 18 వైన్‌షాపులు దక్కాయి. జనాభా ప్రాతిపదికన ఏ మండలానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న దానిపై కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కాగా, ఈ వైన్‌షాపులకు లైసెన్స్ ఫీజు సగమే ఉండటంతో సిండికేట్ వ్యాపారులు అప్పుడే గీత కార్మికుల ఇళ్ల వద్దకు వాలిపోయారు. అన్నీ తామే చూసుకుంటామంటూ ఆఫర్ల వర్షం కురిపిస్తున్నారు.

- వివరాలు 6లో..

జేఈఈ మెయిన్స్ నేటి నుంచే!

- జిల్లాలో 10వేల మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనుండగా తొలివిడతగా బుధవారం నుంచి 24వ తేదీ వరకు, రెండోవిడత 25 నుంచి 29వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 10వేల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పొట్టేపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్, తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో జరిగే పరీక్షలకు కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు.

ఆర్టీసీకి పండుగే!

- సంక్రాంతికి 394 ప్రత్యేక బస్సు సర్వీసులు
- జిల్లాకు రూ.1.11 కోట్ల ఆదాయం

పల్లె జనానికే కాదు.. ఏపీఎస్ ఆర్టీసీకీ సం'క్రాంతు'లు నింపింది. పెద్ద పండుగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చి, వెళ్లే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపింది. ఇలా నెల్లూరు రీజియన్ పరిధిలో దాదాపు 394 బస్సులను ఏర్పాటు చేయగా, పండుగ రోజుల్లో రూ.1.11 కోట్ల ఆదాయం సమకూరింది.



సంక్రాంతి (పెద్ద పండుగ) పండుగ రోజుల్లో జిల్లాకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ అధికారులు 394 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్టణం, చెన్నై తదితర ప్రాంతాలకు ఈ సర్వీసులు నడిచాయి. జిల్లాలోని డిపోల వారీగా నెల్లూరు-1 నుంచి 95, నెల్లూరు-2 నుంచి 95, ఆత్మకూరు నుంచి 31, కావలి నుంచి 26, కందుకూరు నుంచి 69, రాపూరు నుంచి 17, ఉదయగిరి నుంచి 61 బస్సులు నడిచాయి. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలనే వసూలు చేశారు. 2,96,738 కిలోమీటర్ల దూరం బస్సుల నడపగా, 30,652 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇక రూ.1,11,66,421 కోట్లు నెల్లూరు రీజియన్‌కు ఆదాయం సమకూరింది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



వంశీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ జిల్లా సారథిగా మళ్లీ వంశీధరే!

- రెండోసారి అవకాశం ఇచ్చిన అధిష్ఠానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్ష పగ్గాలు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డికే దక్కాయి. సహజంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి జిల్లా అధ్యక్షుల ఎంపిక జరుగుతుంది. అయితే ఆరేళ్లకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం దేశవ్యాప్తంగా జరిగిన సమయంలో జిల్లా అధ్యక్షుల నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు మార్పులు చేర్పులు ఉంటాయి. ఈ క్రమంలో 2024లో బీజేపీ సభ్యత్వ నమోదు జరగడంతో జిల్లా అధ్యక్షుడు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షుడిగా శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఇప్పటికి 17 నెలలే అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లా నుంచి 11 మంది పోటీలో నిలవగా, సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నామినేషన్లు స్వీకరించారు. ఈ క్రమంలో మంగళవారం పార్టీ ఎన్నికల పరిశీలకులు జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పేరును ప్రకటించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు వంశీధర్‌రెడ్డికి శాలువాలు, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయం నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, కందికట్ల రాజేశ్వరి, గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, కర్నాటి అంజనేయరెడ్డి, కమల, యర్రబోలు రాజేష్, యశ్వంత్‌సింగ్, విజయ్‌కుమార్, దాసరి ప్రసాద్, చిలకా ప్రవీణ్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

'మెప్మా'లో అక్రమాలకు చెక్!

జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అక్రమాలకు, బోగస్ పొదుపు సంఘాలకు ఇక చెక్ పడనుంది. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ పాలనలో పొదుపు సంఘాల స్ఫూర్తి దెబ్బతిన్నది. సంఘాల పేరుతో అధికారులు, కొంతమంది నాయకులు విడుదలైన నగదు దిగమింగారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పథకాలకు అర్హులు, అనర్హులు ఎవరు? వారికి ఎంత లబ్ధి చేకూరింది తదితర అంశాలను సర్వే ద్వారా సేకరించి, కంప్యూటరీకరణ ద్వారా గుర్తిస్తారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష, ఈ ప్రకారం కార్యాచరణ మొదలైంది.

- పక్కా సర్వేకు కూటమి ప్రభుత్వం శ్రీకారం
- పొదుపు సంఘాల వివరాల కోసం యాప్



నెల్లూరు (హరనాథపురం), జనవరి 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెప్మాలో 14,366 పొదుపు సంఘాలు ఉన్నాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 9,554, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో 1,359, కావలిలో 2028, ఆత్మకూరులో 754, బుచ్చిలో 671 పొదుపు సంఘాలు ఉన్నాయి. పొదుపు సంఘాల సభ్యులు నెలవారి సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ సమావేశాలకు రాకుండా వచ్చినట్లు నమోదు చేయడం, మృతులనూ సభ్యులుగా కొనసా గించడం, బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయటం, పొదుపు నిధులను ఇష్టానుసారం అప్పుగా ఇవ్వడం వంటి అనేక రకాల మోసాలు జరుగుతున్నాయి. ఇక వీటన్నిటికీ చెక్ పడనుంది. ఇక నెలవారీ సమావేశాలకు బయోమెట్రిక్ ఆధారిత ముఖ హాజరు తప్పనిసరి చేశారు.

● ప్రత్యేక యాప్ రూపకల్పన

పొదుపు సంఘాల్లో ప్రతి సభ్యురాలి వివరాలు చిటికెలో తెలుసుకునేలా మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. సభ్యుల ఆధార్‌తో అనుసంధానమైన పేర్లు, సంఘాల్లో వారు చేరిన తేదీ, విద్యార్హత, కులం, పిల్లలు, వైకల్యం, గ్యాస్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల్లో ఎంతమంది లబ్ధి పొందారు? ఎవరికి రాలేదు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు, జీవనోపాధి, వృత్తిపరమైన నైపుణ్యం, నెలసరి ఆదాయం, వ్యక్తిగత పొదుపు వివరాలు నమోదు చేస్తున్నారు. అలాగే సంఘం సభ్యురాలి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హతలు, పారిశ్రామికంగా అభివృద్ధికి వున్న అవకాశాలు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల కోసం రుణాలు ఆవశ్యకత, కుటుంబ సభ్యుల్లో నిష్ణాతులు ఉంటే ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు . అంతేగాక పొదుపు రుణాలు, వడ్డీ చెల్లింపులు, మాఫీలు, నెలవారీ సమావేశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ఉన్న గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకోసం మెప్మా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. సభ్యుల వ్యక్తిగత ఖాతాలకే నగదు జయచేయటం ద్వారా మామూళ్ల బెడద కూడా ఉండదు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

ఆర్థిక స్వావలంబనకు అవకాశం



సర్వే ద్వారా యాప్‌లో పొదుపు సంఘాలు, సభ్యుల సంపూర్ణ వివరాలు నమోదవు తాయి. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తక నిర్వహణతో సంఘాల బలోపేతంతో పాటు ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుంది. ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

- రాధమ్మ, మెప్మా ప్రాజెక్టు డెరెక్టర్

మొండి బకాయి రూ.25 వేలు

మించితే ఆస్తుల సీజ్

- నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ),జనవరి 21,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులకు సంబంధించి రూ.25 వేలకు మించిన మొండి బకాయిలను గుర్తించి వారి ఆస్తులను సీజ్ చేయాలని కమిషనర్ సూర్య తేజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లపై మంగళవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. నగరంలో నూటికి నూరుశాతం పన్ను వసూళ్లు జరగాల్సిందే నని తేల్చిచెప్పారు. మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటి యజమాని సకాలంలో పన్నులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నోటీ సులకు స్పందించని వారికి ఆస్తుల స్వాధీనం ఉత్తర్వులివ్వాలని ఆదేశించా రు. అనంతరం ఇందిరా భవన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఆహారం నాణ్యతను పరిశీలించారు. ముందుగా 45,46 డివిజన్లలో పర్యటిం చి పారిశుధ్యాన్ని పరిశీలించారు.

'సోమశిల'లో నీటినిల్వ

అనంతసాగరం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 1,890 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 69.128 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

గమ్యం చేరకనే ఆగుతున్న ఊపిరి!



ఓ రైలులో కిక్కిరిసిన బోగీ



ఇలాంటి ప్రయాణం ప్రమాదమే!

- రైళ్లలో పెరుగుతున్న రద్దీ
- జనరల్ బోగీలు చాలక అవస్థలు
- ఉన్నవాటిలోనే ప్రమాదకర ప్రయాణం
- గతేడాది 65 మంది మృత్యువాత

రైలు ప్రయాణం సురక్షితమని ప్రచారం చేస్తున్న రైల్వే శాఖ సాధారణ (జనరల్) బోగీల్లో వెళ్లే ప్రయాణికుల భద్రతను మాత్రం గాలికి వదిలేస్తోంది. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ పేర్లతో నడుస్తున్న రైళ్లకు 20 నుంచి 26 బోగీలు ఉంటున్నాయి. అయితే, వీటిలో జనరల్ ప్రయాణికులకు కేటాయిస్తున్న బోగీల సంఖ్య రెండు లేదా మూడు మాత్రమే ఉంటున్నాయి. మిగిలినవన్నీ రిజర్వేషన్‌కే కేటాయిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా బోగీల సంఖ్య పెంచక పోవడంతో ఉన్నవాటిలోనే కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది. బోగీల తలుపుల పక్కన నిలబడి ప్రయాణిస్తున్న వారు అనుకోని ప్రమాదాల బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. ఇలా గడిచిన ఏడాది కాలంలో సుమారు 65 మంది దాకా దుర్మరణం చెందగా, ఈ నెల 22 రోజుల్లోనే ఆరుగురు మృతి చెందారు.

- బిట్రగుంట (ఆంధ్రజ్యోతి)

రైలు ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా రైల్వే అధికారులు బోగీల సంఖ్య పెంచడం లేదు. ముఖ్యంగా రద్దీకి తగ్గట్టు కొన్ని రైళ్లలో బోగీలు పెంచుతున్న అధికారులు పేద, మధ్య తరగతి ప్రయాణికుడి విషయంలో చేతులెత్తేస్తున్నారు. రైలులో బెర్తులు, సీట్ల రిజర్వేషన్ అయిపోయినా వెయిటింగ్ లిస్ట్ పేరుతో రైల్వే అధికారులు టికెట్లను అమ్ముకుంటున్నారు. సాధారణ బోగీల విషయానికి వస్తే లెక్కకు మించి రైలు టికెట్లు విక్రయిస్తున్నారు. ఏవిధంగానైనా గమ్యం చేరాలన్న ఆతృతతో ప్రజలు ప్రమాదాల అంచున ప్రయాణిస్తు న్నారు. కాగా, కోవిడ్ పేరిట ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన అధికారులు ఆ తర్వాత వాటిని పునరుద్ధరించ లేదు. తిరిగి ప్రారంభిస్తామని ఇటీవల ప్రకటన చేసినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

● ఇతర రాష్ట్రాలకు చెందిన వారే..

రైలు ప్రయాణాల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉంటున్నారు. దూర ప్రాంతం కావడంతో బస్సు చార్జీలు భరించలేక రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. ఉదాహరణకు చెన్నైకు బస్సు చార్జీ రూ.230 ఉండగా, రైలు చార్జీ (జనరల్) రూ.90 ఉంటోంది. అలాగే తిరుపతికి బస్సుకు రూ.190, రైలు చార్జీ రూ.75 ఉంటోంది. విజయవాడ, విశాఖ, హైదరాబాద్, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు రైలు చార్జీలకన్నా బస్సు చార్జీ నాలుగైదు రెట్లు అధికంగా ఉంటోంది. దీంతో అత్యధిక శాతం మంది రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న రైళ్లలో జనరల్ బోగీలన్నీ నిండివున్నా వాటిల్లోనే బిక్కు బిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.

హెచ్చరిస్తూనే ఉన్నాం!



రైళ్లలో ఫుట్‌పాత్ ప్రయాణం వద్దని మా జీఆర్పీ పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, బోగీలు చాలక గమ్యం చేరాలన్న ఉద్దేశంతో ప్రజలు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణి కుల్లో అవగాహన వస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు.

- కే.భుజంగరావు, నెల్లూరు జీఆర్పీ సీఐ

● బిట్రగుంట సెక్షన్ పరిధిలో..

గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో 65 మంది మృత్యువాత పడ్డారు. ఇక ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో అత్యధిక శాతం మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉండటం గమనార్హం. బోగీల్లో సీట్లు లేక ఫుట్‌పాత్ (రైలు బోగీ ద్వారం) వద్ద కూర్చొని ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రద్దీకి చెక్ పెట్టాలంటే ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించడమే మార్గమని నిపుణులు అంటున్నారు. సామాన్య ప్రజానీకం కూడా అదే కోరుకుంటోంది.

మృతుల వివరాలు

నెల	సంఖ్య
జనవరి	6
ఫిబ్రవరి	3
మార్చి	5
ఏప్రెల్	7
మే	5
జూన్	4
జూలై	5
ఆగస్టు	6
సెప్టెంబరు	4
అక్టోబరు	11
నవంబరు	3
డిసెంబరు	6
మొత్తం	65

ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారు

నర్సరీల్లో 59 లక్షల మొక్కల పెంపకం : డీఎఫ్‌వో

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ, సోషల్ ఫారెస్టుల ఆధ్వర్యంలోని నర్సరీల్లో 59 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి రేంజ్ పరిధిలోని దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో నర్సరీలను, ప్లాంటేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీశాఖ 19లక్షలు, సోషల్ ఫారెస్టు 40 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వనసరంక్షణ సమితుల్లో పెంచిన జామాయిల్ కర్రను త్వరలో కటింగ్ చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జేకే పేపర్‌మిల్స్, రాయ్‌ఘడ్ వారు టన్ను రూ.8,100లకు దక్కించుకున్నారని పేర్కొన్నారు. దన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో శ్రీరాములు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ఓంప్రకాష్, లక్ష్మీప్రసన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కావలి రైల్వేస్టేషన్‌లో దట్టంగా అలుముకున్న మంచు


మినీ స్టేడియంలో..

మంచు కప్పేస్తోంది!

జిల్లాను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం 9 గంటల కూడా పొగమంచు ఉండి, చలిగాలులు వీస్తుండటంతో ప్రజానీకం వణికి పోతోంది. వాహన రాక పోకలకూ ఆటంకం ఏర్పడు తోంది. మంగళ వారం ఉదయం 8 గంటలకు కావలి రైల్వే స్టేషన్‌లో కనీసం ట్రాక్ కూడా కనిపించనంతగా మంచు కప్పేసింది. స్టేషన్‌లో రైళ్లు ఆగే వరకు కూడా ఏ బోగీ ఎక్కడుందో కనపడక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇక మినీ స్టేడియం, జేబీ క్రీడా మైదానంలో వాకింగ్ చేసే వారూ ఇబ్బందులు పడ్డారు. ఇక జాతీయ రహదారిపై లైట్ల వెలుగుల్లో వాహన రాకపోకలు సాగాయి.

- కావలి (ఆంధ్రజ్యోతి)

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశుపోషకుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ నెల్లూరు వెటర్నరీ పాలీక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ సోమయ్య పిలుపునిచ్చారు. నగరంలోని మన్సూర్ నగర్‌లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించడమేకాక గర్భకోశ వ్యాధితో బాధపడు తున్న పశువులకు చికిత్స, చూలు పశువులకు పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడం, అనారో గ్య పశువులకు వైద్యం వంటివి శిబిరంలో అందుబాటులో ఉంటాయన్నారు. కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేస్తారని తెలిపారు. ఈనెల 31వతేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయ న్నారు. కార్యక్రమంలో ఏడీకృష్ణమూర్తి, ఎల్‌ఎస్‌ఏ పొదిలి శ్రీనివాసులు, సంచార వాహనం పశువైద్యులు బెల్లంకొండ నవీన్‌కుమార్, పశువైద్య సహాయకులు కే మేఘన పాల్గొన్నారు.



పక్షిరాజా విలాసం

- పల్లె అందాలను మరిపించేలా విహంగాల పెంపకం
- మానసిక ఆనందం కోసం ఇళ్లలో విడుదులు
- ముద్దుపేర్లతో మురుస్తున్న నగరవాసులు

అత్యధికులు పట్టణాలు, నగరాల్లో ఉంటున్నా, పల్లెల్లో ఉన్న అనుభూతిని పొందాలంటే ఇంట్లో మొక్కలుంటేనే సరిపోదు...రకరకాల పక్షులు, అవి చేసే కిచకిచ శబ్దాలు.. వింటేనే ఆ ఆనందాన్ని అనుభవించగలం. నేడు ఎంతో మంది నెల్లూరు నగరవాసులు వింతైన, విచిత్రమైన, అం దమైన వివిధ జాతుల పక్షులను తమ ఇళ్లలో పెంచుకుం టున్నారు. వీటి పుట్టుక విదేశీయమైనా దేశీయంగా పురుడు పోసి ప్రకృతి ప్రియులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇళ్లలో పక్షులను పెంచుకునే వారు వాటిని కుటుంబంలో సభ్యులుగా చేర్చుకుని ముద్దు పేర్ల పిలుస్తూ మురిసిపోతు న్నారు. పక్షుల కోలాహలంతో ఇళ్లంతా సందడి ఉండాలనుకునే వారి అభిరుచులు పెరుగుతుండటంతో వాటి విక్రయ కేంద్రాలు నగరంలోనూ విరివిగా విస్తరిస్తున్నాయి.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



స్వీటీ.. గోల్డీ.. చీప్.. సోఫీ.. బీస్.. గబ్బీ..డార్లింగ్.. లక్కీ... బింగో.. సింగర్... ఏంటీ.. ఇవన్నీ ఏమనుకుంటున్నారు..? ఇళ్లలో ముద్దుగా పెంచుకునే పక్షుల పేర్లు. కుటుంబంలో సభ్యులుగా పెంచుకుంటున్న వివిధ జాతుల పక్షులకు ప్రకృతి ప్రియులు ముద్దుగా పెట్టుకున్న పేర్లు. ధర ఎంతైనా ఎవరూ లెక్క చేయడంలేదు. చూడటానికి అందంగా ఉంటే చాలు. కొనేసి ఇంట్లో పెట్టుకుని మురిసిపోతున్నారు. నెల్లూరు నగరంలోని మాగుంటలేఅవుట్, లీలామహల్, బాలాజీనగర్, ట్రంకురోడ్డులోని లస్సీ సెంటరు, వేదాయ పాళెం, సంతపేట ప్రాంతాల్లో దేశ, విదేశాల నుంచి పక్షులను తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారు. వీటిల్లో ఎక్కువగా ఆఫ్రికా దేశానికి చెందిన జీబ్రా పించెస్ జాతి, ఆఫ్రికా లవ్‌బర్డ్స్ ఆకర్షిణీయంగా ఉన్నాయి. గ్రీన్, ఎల్లో, ఎరుపు రంగుల్లో ఇవి లభిస్తున్నారు. ఈ పక్షులు 3 నుంచి 15 ఏళ్ల వరకు జీవించగలవు. జత రూ. 600 నుంచి 2,500ల వరకు ధర ఉంది. చూడటానికి అందంగా ఉంటే ఆఫ్రఫికా, జపాన్, సౌత్‌అమెరికా దేశాలకు చెందిన కాక్‌టైల్ పక్షులు 15 ఏళ్ల వరకు జీవించగలవు.ఇవి జత రూ. 3,500 నుంచి రూ. 6 వేల వరకు ఉంది. ఇక అత్యంత ఖరీదైన సంకనూర్ జాతి పక్షులు నార్త్, సౌత్ అమెరికాకు చెందినవి. ఇవి 30 ఏళ్ల వరకు జీవించగలవు. ఈ పక్షి ధర రూ. 15 వేలు ఉండగా జత రూ. 25 వేలకు విక్రయిస్తున్నారు. ఇవి క్యారెట్, బీట్‌రూట్‌ను ఆహారంగా తీసుకుంటాయి. దేశీయంగా లభించేవి లవ్‌బర్డ్స్ 15 గరిష్ఠంగా ఏళ్ల వరకు జీవిస్తాయి. ఎరుపు రంగలో ఉండేవి వీటి జత రూ. 800కు లభిస్తుండగా, మిగిలిన రంగుల్లోవి రూ. 600కు ఇస్తున్నారు.





● కొర్రలు, కొత్తిమేర ఆహారం

అందమైన పక్షులను కొనుగోలు చేస్తేనే సరిపోదు. వాటికి ఇష్టమైన కొర్రలు, కొత్తిమేరను ప్రతిరోజు ఆహారంగా ఇవ్వాలి. వీటిని అవి ప్రీతిగా తింటాయి. వీటి పెంపకానికి వినియోగించే బోన్లు రూ. 600 నుంచి రూ. 5 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటిని తయారీదారులు వివిధ ఆకృతిల్లో చేసిస్తారు. బోన్లులోనే ఆహారం, నీరు, ఆడుకునేందుకు వస్తువులు, పడుకునేందుకు మెత్తడి పచ్చిగడ్డి, ఇతర బొమ్మలను ఉంచుతారు. వీటిని ఇళ్లలో పక్షుల గూళ్లుగా ఉంచి పల్లెటూరి అనుభూతులను ఆస్వాదిస్తున్నారు. బిజీబిజీగా మారిన నేడు జీవనశైలిలో ఇంటికి రాగానే కాస్త కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూనే పక్షులతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

● పెంపకంలో మహిళలే అధికం

ఇళ్లలో పక్షులను పెంచేవారిలో అత్యధిక శాతం మంది మహిళలే ఉన్నారు. వారు ఇళ్లలో ఎక్కువ సమయం గడిపడం, ఓపిక ఎక్కువ కాబట్టి ఇంటిని అందంగా ఉంచుకోవడంతోపాటు పక్షులు, జంతు ప్రపంచాన్ని ఇంట్లో ఉంచుకోవాలన్న ఉద్దేశంతో నివాసాన్నే ప్రకృతి ప్రపంచంగా మలుచుకుంటున్నారు. ఇళ్లలోని పెద్దల దగ్గర నుంచి పిల్లల వరకు మహిళలే ఎక్కువగా పక్షులను పెంచుతూ ముద్దుపేర్లుతో పిలుచుకుంటూ కొత్త అనుభూతులను ఆస్వాదిస్తున్నారు.



పక్షుల పెంపకంతో కొత్త అనుభూతి



ప్రకృతి నుంచి ప్రత్యక్షంగా పొందలేని అనుభూతులను ప్రజలు పక్షుల పెంపకంతో ఇళ్లలోనే పొందుతున్నారు. కొత్త రకాలు ఏవొచ్చినా ఇట్టే పట్టికెళ్లిపోతు న్నారు. నెల్లూరు నగరంలో పక్షుల ప్రేమికులు ఎక్కువగా ఉన్నారు. ధరతో సంబంధం లేకుండా అందమైన పక్షులుంటేచాలు కొనేసుకుంటున్నారు.

- మహమద్ సిరాజ్, పక్షుల విక్రయ కేంద్రం నిర్వాహకుడు

పక్షులను పలుకరిస్తే చెప్పలేని ఫీలింగ్



పక్షులను ఇళ్లలోకి తెచ్చుకుని ముద్దు పేర్లతో పిలుస్తుంటే చెప్పలేని కొత్త ఫీలింగ్ ఉంటుంది. అవి నా ఫ్రెండ్స్‌లాగే అనిపిస్తాయి. కాసేపు మనసారా మాట్లాడుకోవచ్చు. వాటితో ఉన్నంతసేపు నాకు మరో ప్రపంచంలో ఉన్నట్టే ఉంటుంది.

- అలియా, పక్షుల పెంపకందారు

హైదరాబాద్ వాసికి కొడుకును అమ్మిన తండ్రి

- స్థానికులు నిలదీయడంతో వెలుగులోకి..

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకునే హైదరాబాద్‌వాసికి విక్రయించిన ఓ కసాయి తండ్రి ఉదంతమిది. బుచ్చి మండలం మినగల్లు బీసీ కాలనీలో మంగళ వారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. మినగల్లు బీసీ కాలనీలో ఉంటున్న గిరిజన దంపతులు పిడూరి రవి, వెంకమ్మలకు ముగ్గురు సంతానం. ఏడేళ్ల క్రితం రవి తన పురిటి బిడ్డను కూడా అమ్మేశాడు. తాజాగా మరో కుమారుడు వెంకటేష్ (7)ను హైదరాబాద్ వాసికి విక్రయించాడు. సోమవారం సాయంత్రం హైదరాబాదు నుంచి వచ్చి న ఓ గుర్తుతెలియని వ్యక్తికి కొడుకు వెంకటేష్‌ను రూ.లక్షకు అమ్మేశాడు. అనంతరం రవి కొడుకుతోపాటు సదరు వ్యక్తితో కలిసి హైదరాబాదు వెళ్లాడని స్థానికులు తెలిపారు. అక్కడ వదిలిపెట్టిన తరువాత రూ.లక్ష తీసుకుని వస్తాడని వారు పేర్కొన్నారు. ఇంత జరిగినా వెంకమ్మ మిన్నకుండిపోవడంపై వారు ఆమెను నిలదీశారు. ఇళ్లలో ఎవరూ లేనప్పుడు తమ పిల్లలను కూడా ఇలానే అమ్మేస్తే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సర్పంచు పూజిత, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదని వారన్నారు. దీంతో ఎంపీడీవో శ్రీహరితోపాటు సీడీపీవోకి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. సూపర్‌వైజర్‌ను అప్రమత్తం చేసినట్టు సీడీపీవో జ్యోతి తెలిపారు. బుధవారం కాలనీకి వెళ్లి విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.


పిడూరి రవి భార్య వెంకమ్మ

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

- రూ.17.35 లక్షల సిగరెట్లు స్వాధీనం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట జీనిగిలవీధిలోని ఓ ఇంటిపై దాడిచేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.17.35 లక్షల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో గోదాములో లక్షలు విలువ చేసే పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. బిల్లులను కూడా గోదాము నిర్వాహకుడి నుంచి స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాన్, డీసీటీవో విష్ణురావు, ఏవో యానాది పాల్గొన్నారు.

చీదెళ్లవారి సత్రం భూములు అన్యాక్రాంతం

లోకాయుక్తకు వారసుడి ఫిర్యాదు


చీదెళ్లవారి సత్రంకు చెందిన భూమిలో అక్రమ నిర్మాణాలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేటలోని దాదాపు రూ.200 కోట్ల విలువ కలిగిన చీదెళ్లవారి సత్రం భూములు అన్యాక్రాంతం అయ్యాయి. దేవదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆ సత్రం భూములతోపాటు దాత ఆశయాలు ఆవిరయ్యాయి. ఈ వ్యవహారంపై దాత వారసుడు నంబూరు వెంకట సంతోష్‌బాబు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. చీదెళ్లవారి సత్రంను నిర్మించిన దాత చీదెళ్ల వెంకట రమణయ్య, ఆయన సంతతి నవాబుపేటలోని సర్వే నెం.171లో 3.63 ఎకరాల భూమిని అప్పటి మదరాసు నగరంలో 1422/1875 డాక్యుమెంట్ ద్వారా చీదెళ్లవారి సత్రం పేరిట సదరు ఆస్తిని మద్రాసు నగరంలో రిజిస్టర్ చేశారు. చీదెళ్లవారి సత్రం నిర్మాణంతోపాటు నిర్వహణకు 48 అంకణాల స్థలంలో 16 ఇళ్లను నిర్మించారు. వీటితోపాటు 2.5 ఎకరాలలో కోనేరు, ఫలసాయం అందించే చెట్ల తోటను ఏర్పాటు చేశారు. దాత వీలునామా ప్రకారం తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో చీదెళ్లవారి సత్రంలో అన్నదానం జరపాలనే అంశాలను తన ఫిర్యాదులో వెంకట సంతోష్‌బాబు పేర్కొన్నారు. 1975లో దాత ఆస్తులను దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. అయితే, కొంతమంది అధికారులు అవినీతి, నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లతో చీదెళ్లవారి సత్రం, ఇళ్లు, కోనేరు, తోటను అక్రమార్కులకు పంచేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దేవదాయ శాఖ, రెవెన్యూ, నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులకు అర్జీలు ఇచ్చినా వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు. రూ.200 కోట్లకుపైగా విలువ కలిగిన ఈ ఆస్తులను పరిరక్షించాలని కోరారు.

బుచ్చిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు ఎప్పటికో!

29 ఏళ్లుగా కార్యకర్తలు, అభిమానుల నిరీక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఉద్దండులకు నిలయమైన బుచ్చిరెడ్డిపాళెంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహం ఏర్పాటు కలగానే మిగులుతోంది. 1982లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుచ్చికి చెందిన బెజవాడ పాపిరెడ్డి వ్యవహరించారు. అప్పట్లో బుచ్చి అల్లూరు నియోజకవర్గంలో ఉండగా ఎమ్మెల్యేగా ఆయన (1983) ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 1985లో సీపీఎం, 1989లో కాంగ్రెస్, 1994లో సీపీఎం అభ్యర్థులు గెలుపొందారు. ఎన్టీఆర్ చనిపోయే నాటికే పాపిరెడ్డి అనారోగ్యానికి గురవడంతో అప్పట్లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కుదరలేదు. కాగా, 1993లో జరిగిన ఉప ఎన్నికలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీ తరపున గెలుపొందారు. 1999లో టీడీపీ నుంచి అల్లూరు ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందినా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి కోటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా బుచ్చి కోవూరు నియోజకవర్గంలో కలిసింది. 2009 ఎన్నికల్లో టీడీపీ తరపున నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 2012లో జరిగి ఉప ఎన్నికల్లో వైసీపీ తరపున ప్రసన్న గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విజయం సాధించారు. 2019లో వైసీపీ, ఆ తర్వాత 2024లో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపొందారు. ఇలా ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందినా దివంగత ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు మాత్రం జరగలేదు. పోలంరెడ్డి వారసుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా సారథ్యం వహించినా ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై దృష్టి సారించలేకపోయారు. బుచ్చి మండలంలో కొంతమంది టీడీపీ నాయకులు పదవులకోసం ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించినా ఆ తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం కొంతమంది నాయకులు, కార్యకర్తలు చందాలు ఇస్తామని ముందుకొచ్చినా పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుతం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అయినా స్పందించి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు చొరవ చూపాలని నాయకులు, అభిమానులు కోరుతున్నారు.



గీత కులాలకు 18

- వైన్‌షాపులు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- అప్పుడే సిండికేట్ వ్యాపారుల ప్రయత్నాలు

ఎన్నికల్లో హామీ మేరకు ఎన్డీఏ కూటమి గీత కులాల వారికి 18 వైన్‌షాపులు కేటాయించింది. అయితే జనాభా ప్రాతిపదికన ఏ మండలానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న దానిపై కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. గీత కులాల వారికి కేటాయించే వైన్‌షాపులకు లైసెన్స్ ఫీజు సగమే ఉండటంతో ఆ షాపులను దక్కించుకునేందుకు జిల్లావ్యాప్తంగా సిండికేట్ ప్రయత్నాలు ప్రారంభించింది.

నెల్లూరు (క్రైం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలను మూడు కేటగిరీలుగా విభజించింది. ఏ కేటగిరీలో యాత, బీ-కేటగిరీలో గౌడ్, ఈడిగ, గౌడ (గమళ్ల), కలాలీ, గౌండ్ల, శ్రీసాయన, సొండి, శెట్టిబలిజ, సీ-కేటగిరీలో సొండి కులాన్ని విడిగా చూపించారు. గీత కులాల్లోని ఉపకులాల ఆధారంగా జిల్లాలో ఏ ఉపకులాలు ఉన్నాయి.. జనాభా ఎంత? అన్న లెక్కలను ఎక్సైజ్ అధికారులు తీస్తున్నారు. మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం జిల్లాకు 18 షాపులు దక్కనున్నాయి. ఉపకులాల వారీగా గౌడ్‌లకు 6, గౌడలకు 6, గమళ్ళకు 4, గౌండ్లకు 1 వైన్‌షాపులకు కేటాయించారు. అయితే, జీవోలో కేటాయించిన షాపుల్లో 17 షాపులే వస్తున్నాయి. ఒక షాపు మిస్ కావడంతో ఎక్సైజ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక కేటాయించిన వైన్‌షాపుల్లో గీతకులాల జనాభా ఆధారంగా ఏ మండలాల్లో ఏ ఉపకులానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న గజిట్‌ను కలెక్టర్ విడుదల చేస్తారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా గీత కులాల వారు ఉన్నట్లు తెలుస్తోంది.

● సిండికేట్ల లాబీయింగ్

గీత కులాల వారికి కేటాయించే వైన్‌షాపుల్లో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా, లాటరీ విధానంలో షాపులు దక్కించుకుంటే లైసెన్స్ ఫీజులో సగభాగం చెల్లిస్తే సరిపోతుంది. గతంలో కేటాయించిన సాధారణ వైన్‌షాపులకు నెల్లూరు కార్పొరేషన్‌లో రూ.93 లక్షలు, నెల్లూరు రూరల్‌లో రూ.60.50 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.65లక్షలు, రూ.55 లక్షల చొప్పున వార్షిక లైసెన్సు ఫీజులు చెల్లించారు. అయితే గీత కులాలకు కేటాయించే వైన్‌షాపులకు లైసెన్సు ఫీజు సగం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సిండికేట్‌గా మారిన వ్యాపారులు గీత కులాలకు కేటాయించనున్న 18 వైన్‌షాపులపై కన్ను వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నమ్మకంగా ఉన్న గీత కులాల వారితో సంప్రదింపులు చేసి అన్నీ తాము చూసుకుంటామని, కుల సర్టిఫికెట్ ఇచ్చి తమతోపాటు లాటరీ తీసే ప్రాంతానికి వచ్చి సంతకం పెడితే చాలు అంటూ నమ్మబలుకుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత

లింగసముద్రం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత గత కొన్నేళ్లుగా వేధిస్తోంది. ఈ సమస్యతో ప్రజలకు సకాలంలో పనులు జరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దారు కార్యాలయంలో మండల సర్వేయరు, రీ సర్వే డీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వలేటివారిపాలెం సర్వేయరు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ పోస్టు, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపీడీఓ శ్రీనివాసులుకు ఇన్‌చార్జి ఈఓఆర్డీగా బాధ్యతలు అప్పగించారు. అలాగే వలేటివారిపాలెం హౌసింగ్ ఏఈ నాగరాజు మండల ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ-1గా కొండాపురం ఎంఈఓ-1 రవికుమార్‌ను ఇన్‌చార్జిగా ఉన్నారు. బీసీ బాలికల వసతి గృహానికి గత ఐదేళ్లుగా కందుకూరు బీసీ బాలికల వసతిగృహం వార్డెన్, అలాగే స్థానిక బీసీ బాలుర వసతి గృహానికి కావలి వసతి గృహ వార్డెన్‌ను ఇన్‌చార్జిగా ఉన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగసముద్రం తహసీల్దారు కార్యాయం

డ్రోన్ పిచికారితో ప్రయోజనం

కందుకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి రాము తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం మోపాడు, మాచవరంలో వరిపైరును పరిశీలించి సూచనలిచ్చారు. అనంతరం మాచవరంలో ఎడ్ల శీనారెడ్డి పొలంలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించారు. ఎకరం పొలానికి ఐదారు నిమిషాల్లో పిచికారీ పూర్తయినట్లు చెప్పారు.

వాడవాడలా రోడ్డు భద్రతా మాసోత్సవాలు

పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారం


ఉదయగిరి : ర్యాలీ చేపట్టిన ఎస్‌ఐ శ్రీనివాసులు


ఆత్మకూరు : అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్

● ఉదయగిరి: ఎస్‌ఐ శ్రీనివాసులు రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకేశవులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్‌ఐ ఆదిలక్ష్మి దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి మానహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ గంగాధర్ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురష్కరించుకుని ఆత్మకూరులో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ జిలాని పాల్గొన్నారు.

● సంగం: ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుంచి విద్యార్థులు జాతీయ రహదారి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైవే కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో , ఏఎస్‌ఐ జలీల్‌ఖాన్, శిఖామణి పాల్గొన్నారు.

● కందుకూరు: టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి సీఐ వెంకటేశ్వరరావు సర్కిల్ కార్యాలయం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సాంబశివయ్య, మహేంద్రనాయక్, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు షేక్ షానాజ్‌బేగం, నరేష్‌రాజ ఉన్నారు.

● వలేటివారిపాలెం: ఎస్‌ఐ మరిదినాయుడు పోలీస్‌స్టేషన్ నుంచి విద్యార్థులతో ర్యాలీగా వచ్చి బస్టాండు సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

● చేజర్ల, (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి, మానహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏఎస్‌పేట: ఎస్‌ఐ సైదులు ఠాగూర్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నాగారఖానా సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రమణరెడ్డి,హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


చేజర్ల: మానవహారాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులు


సంగం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు


కందుకూరు: ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్‌ఐలు

పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఆత్మకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ తెలిపారు. ఆశ్వనీపురంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 20నుంచి 31వరకు అన్ని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీఎస్ జయచంద్ర, ఈవో డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీనివాసరావు, పశు వైద్యాధికారులు డాక్టర్ కృష్ణయాదవ్, డాక్టర్ రసూల్ పాల్గొన్నారు.

● అనంతసాగరం: మంచాలపల్లిలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ గురు జయంతి మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● చేజర్ల: మడపల్లిలో ఉచిత పశుఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ దూడలకు, పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసి, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు శ్రీకాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.

● బొమ్మరాజుచెరువులో..

వింజమూరు: బొమ్మరాజు చెరువు గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100కుపైగా పశువులకు చికిత్స చేశారు. 20పైగా పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథ్, ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ వీరశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● చుండిలో పశుఆరోగ్య శిబిరం

వలేటివారిపాలెం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చుండిలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు, దూడలకు స్థానిక సహాయకులు కేవీ బ్రహ్మయ్య నట్టల నివారణ మందు వేయించారు. పశువులకు చూడు పరీక్షలు, తిరగకట్టిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలకొండ దేవస్థాన మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, ఎల్‌ఎస్‌ఏ అనుపమ, పశువైద్య సిబ్బంది కిరణ్, శ్రీమాణ్, తరుణ్, రమేష్, కొండారెడ్డి పాల్గొన్నారు.

● కొండాపురం: సత్యవోలు పంచాయతీ లింగసపాలెంలో ఉచిత పశు వైద్య వైద్యశిబిరం నిర్వహించారు. శాయిపేట పశువైద్యాధికారి ఎం. మధు పశువులు, దూడలకు నట్టల మందు వేశారు. గొర్రెలకు అమ్మవారు (బొబ్బ) మందులు వేశారు. కార్యక్రమంలో గోరంట్ల శ్రీనివాసులు, మందపల్లి మాధవరావు, దాసరి రాఘవులు, పశువైద్య సిబ్బంది వైఎస్.శేషాద్రి, విజయనరసింహ, శ్రీనివాసులు, ఖ్యాతి పాల్గొన్నారు.

● కందుకూరు: పందలపాడు, పాలూరులో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలు, దూడలకు డీవార్మింగ్ మందులు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఇవ్వటంతో పాటు సాధారణ వ్యాధులకు, గర్భధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాశాల సహాయసంచాలకులు చంద్రమోహన్, మండల పశు వైద్యాధికారి సుధాకర్, సిబ్బంది ఉన్నారు.


అనంతసాగరం: మందు వేస్తున్న ఏడీ గురుజయంతి


కొండాపురం: ఇంజక్షన్ వేస్తున్న పశువైద్యాధికారి మధు


వీవీపాలెం : చుండిలో గేదెకు మందు వేస్తున్న ఏడీ బ్రహ్మయ్య

మార్చి నెలాఖరుకు లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలి

● డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను మార్చి నెలాఖరుకు నూరు శాతం అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతి బుధవారం నిర్వహించే రివ్యూ సమావేశాల్లో లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ఆదిశగా పయనించాలన్నారు. లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. గోకులంషెడ్‌ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉదయగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఏపీడీ గాయత్రీదేవి, ఏపీవోలు శ్రీనివాసరావు, సుభాషిణి, ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ గంగాభవాని

సీపీఎం రాష్ట్ర మహాసభల విజయవంతంపై ప్రచారజాతా

కావలిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం పట్టణ బ్రిడ్జి కూడలిలో ప్రజానాట్యమండలి సభ్యులతో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి సభ్యులు ఆడుతూ పాడుతూ ప్రచారజాత నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య మాట్లాడారు. సభలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, మస్తాన్, మాల్యాద్రి, ప్రజా నాట్యమండలి కళాకారులు మోహన్, గోపి, శంకరయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, బాష, రమణయ్య పాల్గొన్నారు.

● వలేటిపాలెంకు చేరుకున్న ప్రచారయాత్ర

వలేటివారిపాలెం: ఈ నెల 19వ తేది నెల్లూరు నుంచి ప్రారంభమైన సీపీఎం ప్రచార ర్యాలీ మంగళవారం వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు చేరింది. కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్, మాదాల రమణయ్య, దార్ల మాదవరావు, కే. మాలకొండయ్య పాల్గొన్నారు.

● లింగసముద్రం: ఫిబ్రవరి 1, 2, 3 తేదీలో నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ సీపీఎం నాయకులు జీవీబీ కుమార్ కోరారు. మహాసభల ప్రచారంలో భాగంగా జరుగుతున్న ప్రచార జీపు జాత మంగళవారం సాయంత్రం లింగసముద్రం చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు మాధవరావు, ఎంవీ రమణ, శ్రీకాంత్, రమణయ్య, వేణు ఉన్నారు.


కావలి: బ్రిడ్జి కూడలిలో ప్రచారజాతా నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు


వలేటివారిపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న కుమార్

లక్కీ డిప్ బహుమతుల ప్రదానం

కావలి, జనవరి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో అధికారి రామస్వామి సౌజన్యంతో ప్రవేశపెట్టిన లక్కీడిప్ పథకం చేపట్టారు. మంగళవారం ఆర్టీసీ డిపో తీసిన డిప్‌లో ఎంపికైన ముగ్గురు ప్రయాణికులకు విలువైన చీరలు అందచేశారు. కార్యక్రమంలో డీఎం రాహూరు శ్రీనివాసులు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు ఎస్‌కే షమీమ్, అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కల్పనారెడ్డి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజరు రమేష్‌బాబు, రవిప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే

కావలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కృషితో విశాఖ ఉక్కునకు ఆర్థిక భరోసా లభించిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థికప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేయడంపై మంగళవారం ఆయన స్థానిక కార్యాల యంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18వేల కోట్లు అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమార్‌స్వామికి టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్‌లు విన్నవించిన కొద్ది రోజులకే కేంద్రం నిధులు విడుదల చేయండ హర్షనీయం అన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

బిట్రగుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో ఎస్వీ పీఎం కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని కావలి కాలువ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ మదుబాబునాయుడు అన్నారు. బోగోలు మండలంలోని కావలి కాలువను నీటి సంఘం అధ్యక్షులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రెండు లక్షల నిధులతో చేయించే కాలువ పనులను దామవరం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, నారాయణపురం రైతులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీపీఎం అధ్యక్షులు యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన రమణయ్య, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు గణేషం రమేష్‌రెడ్డి, మహేశ్వర, గోపాలు, పులి మాధవ వేణు ఉన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

లింగసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చెరువు అలుగులో పేరుకపోయిన చెత్త కుప్పలను మంగళవారం సర్పంచ్ పులి రాఘవులు ఎక్స్‌కవేటర్ తొలగింపజేశారు. వీరి వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు, లింగసముద్రం సాగు నీటి సంఘం అధ్యక్షులు చిన నాగిరెడ్డి, కార్యదర్శి మాధవరావు ఉన్నారు. అలాగే ఆర్యవైశ్యుల శ్మశాన వాటిక, ఎంపీడీఓ కార్యాలయ వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న జంగిల్‌ను తొలగించారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీవో శారద తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించడంతో పాటు లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సూచనలిచ్చారు.

రేపు విద్యుత్ అదాలత్

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదాలత్‌ను మండలం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ మంగళవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 23న అల్లూరులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలపవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు హాజరవుతారని తెలిపారు.

3అల్లూరు21 : సింగపేట ఎస్టీ కాలనీలో పర్యటించిన హౌసింగ్ పీడీ వేణుగోపాల్

నిలిచిన ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల మంజూరు

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ హయాంలో నిలిచిన ఇళ్ల నిర్మాణాల బిల్లులు మంజూరు చేస్తున్నట్లు ఆ వివరాలను లబ్ధిదారులు స్థానిక హౌసింగ్ అధికారులకు అందజేయాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన సింగపేట గిరిజన కాలనీ పర్యటించి ఇళ్లను పరిశీలించారు. మండలంలో 101 గృహాలు ఉన్నాయని వాటికి సంబంధించిన బిల్లుల విషయాన్ని పరిశీలించామన్నారు. మార్చి 31 నాటికి గృహాల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సిహెచ్. వెంకటేశ్వర్లు, అమర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

వంశీధర్‌రెడ్డిని కలిసిన మాలేపాటి


వంశీధర్ రెడ్డిని సన్మానిస్తున్న మాలేపాటి తదితరులు

కొండాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వంశీధర్ రెడ్డిని మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా చినమాల కొండయ్య, వింతా గోపాల్, హరిగోపాల్‌రెడ్డి, లెక్కమనేని రాజేషనాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవాలు


పోలేరమ్మ ఉత్సవాల్లో కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం పంచాయతీ లింగంగుంటలో వెలసిన పోలేరమ్మ ఉత్సవాలను మంగళవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా పెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయకమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.

29న ఎస్ఆర్ పురం మండల సమావేశం

సీతారామపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఈ నెల 29న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతోపాటు విద్య, తాగునీరు,గృహ నిర్మాణ శాఖ,ఉపాధి హామీ, పారిశుద్యం, సీజనల్ వ్యాధులు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలి

● మండల వైద్యురాలు జహారిక



బిట్రగుంట, జనవరి 21, (ఆంధ్ర జ్యోతి) గ్రామాల ప్రజలు వ్యక్తిగత శుభ్రతో పాటు పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని మండల వైద్యురాలు జహారిక తెలిపారు..

? వైరల్ జ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం.

! మారుతున్న కాలానికి అనుగుణంగా వాతారణంలో మార్పులు వస్తాయని, అందులో ఈ పరిస్థితుల్లో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. మండలంలో జ్వరాల బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

? జ్వరాల రాకుండా ఏ చర్యలు తీసుకోవాలి.

! ప్రజలు తాగునీటిని వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలి. ఇలా చేయడం కలుషిత నీటిలో వ్యాదులు కలిగించే సూక్ష్మజీవులు మరణిస్తాయి. అప్పటికీ జ్వరాలు తగ్గకపోతే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వేసుకోవాలి.

? ఎలాంటి చికిత్స చేయించుకోవాలి.

! విష జ్వరాల పీడితుల్లో రక్త కణాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ సమయంలో శక్తి తగ్గి బలహీనంగా ఉండటం, ఒళ్లు, కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. వైద్యుల సలహాలతో మందులు వాడాలి. సులువుగా అరిగే పౌష్టికాహారం తీసుకోవాలి.

రూ.3.88 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో రూ.3.88 కోట్లతో 43 సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని సీతారామపురానికి రూ.32 లక్షలు, ఉదయగిరి రూ.29 లక్షలు, దుత్తలూరు రూ.37 లక్షలు, వరికుంటపాడు రూ.37లక్షలు, వింజమూరు రూ.38 లక్షలు, కొండాపురం రూ.45 లక్షలు, కలిగిరి రూ.కోటి, జలదంకికి రూ.70 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

మెగా వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగపేటలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించే ఆరోగ్యమస్తు కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నేతృత్వంలో స్థానిక టీడీపీ నాయకుడు బండి అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు 300మందికి వైద్యపరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో మల్లూరు సురేష్, ప్రసాద్, పోసిన శ్రీహరి, గంటా కుమార్, సురేష్ పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి జాతీయ పురస్కారం


పురస్కారాన్ని అందుకున్న కనకవల్లి

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నార్త్‌మోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల అధ్యాపకురాలు కనకవల్లికి సావిత్రిబాయిపూలే జాతీయ పురస్కారం లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ కె.శివకుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 19న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో స్థానిక ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఖాజారంతుల్లాలతో పాటు సిబ్బంది, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలిగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లావనరుల కేంద్రం ఏవో శైలజాకుమారి తెలిపారు. మంగళవారం వెలగపాడు రైతు సేవాకేంద్రంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనగ పంటలో పలు సూచనలిచ్చారు.